వాస్తవాలు పలుకు DD9

TGTEL/26/A2635

వార్త

తెలుగు దినపత్రిక


హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 140 | 01-10-2026 | గురువారం | పేజీలు: 10 | వెల: 3/-



ఈసీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆందోళనలు

- అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో నిరసనలు
- అక్టోబర్ 6న ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్ష ఎంపీల ర్యాలీ
- అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలవాలని నిర్ణయం
- ఓటర్ల జాబితా సవరణపై విపక్షాల అభ్యంతరాలు
- పాతఓటర్లజాబితానేపరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్

2



విమానంలో భారీ కుదుపులు.. భయపడిన ప్రయాణికులు

- అహ్మదాబాద్ నుంచి ముంబయికి వెళ్తుండగా ఘటన
- విమానం ఒక్కసారిగా తీవ్రంగా కుదుపులకు గురైన వైనం
- భయంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు
- వీడియో తీసిన ప్రయాణ ప్రభావకురాలు కామియా జానీ
- 'ఇదే నా చివరి ప్రయాణం కావొచ్చు' అంటూ సందేశం

2



2

కాక్‌పిట్‌లో కత్తితో దాడి.. సౌదీలో దిగిన విమానం

- దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తుండగా ఘటన
- కెప్టెన్‌పై కోపైలట్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం
- విమానంలో సుమారు 180 మంది ప్రయాణికులు
- ఘర్షణ సమయంలో భారీగా తగ్గిన విమానం ఎత్తు
- అత్యవసర సంకేతాలు పంపిన విమానం
- ప్రయాణికులు, సిబ్బంది కోపైలట్‌ను అడ్డుకున్నట్లు సమాచారం
- సౌదీ అరేబియాలోని టబుక్‌లో అత్యవసరంగా ల్యాండింగ్



ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత ఉండాలి

- వీబీ-జీ రామ్ జీ అమలుపై క్షేత్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడిన మంత్రి
- అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని ఆదేశం
- గ్రామసభల నిర్ణయాలకే పనుల ఎంపికలో ప్రాధాన్యం
- గ్రామాల్లో పనుల గుర్తింపు, పురోగతిపై ఆరా
- సర్పంచ్‌లు, కార్యదర్శులు, క్షేత్ర సహాయకులతో చర్చ
- పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- 12 వేల మందికిపైగా సర్పంచ్‌లు పాల్గొన్న సమావేశం
- గ్రామీణ ఉపాధి, అభివృద్ధిని మరింత బలోపేతం చేయాలని సూచన

హైదరాబాద్, (డీడీ9 వార్త):

గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆమె సమీక్షించారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.

గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించాలని సీతక్క సూచించారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మిగతా 2 లో..

సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేస్తాం..

- బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారిందన్న సీఎం
- కేసీఆర్ కుటుంబం ప్రజల ఓట్లను ఆస్తులుగా మార్చుకుందని విమర్శ
- నేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలపై కేటీఆర్‌ను ప్రశ్నించిన రేవంత్
- సిరిసిల్ల ప్రజల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారని సీఎం వ్యాఖ్యలు
- మానేరు ఇసుకలో వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపణ
- కేటీఆర్‌కు వరుస విజయాలు అందించినా కార్మికుల సమస్యలు తీరలేదని వ్యాఖ్య



హైదరాబాద్, (డీడీ9 వార్త):

సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు.

కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు.

గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.

బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, మిగతా 2 లో..

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు


- తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్
- నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న
- తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా

హైదరాబాద్, (డీడీ9 వార్త):

పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు సినిమాలు పాన్‌ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా మిగతా 2లో..





ఆర్ అండ్ బి శాఖకు ఏమిచ్చారో...?

వివరాలు 10 లో..

- రహదారిని "స్టాక్ యార్డ్ "చేసేశారు
- మాఫియాకు ఆర్ అండ్ బి రోడ్లు తాకట్టు పెట్టేశారా..?
- ప్రధాన రహదారిని ఆనుకునే ఇసుక డంపింగ్
- రవాణా ఇబ్బందులు ఎవరికీ పట్టవా?
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే ఎవరిది బాధ్యత..?
- ప్రజా ప్రయోజనాలు ఫణంగా పెట్టేశారా..?
- ఇసుక మాఫియా అనుకూలతలే ముఖ్యమా...?
- కాంట్రాక్టర్లకు ఆర్ అండ్ బి రహదారులు దారాదత్తం
- టిఎస్ఎండిసికి అవినీతి మత్తు
- ఇసుక నిల్వల నిర్వహణపై పర్యవేక్షణ లోపం

ప్రభుత్వ శాఖ ఏదైనా ఇసుక మాఫియా కు దాసోహం కావాల్సిందే... ఇసుక బినామీలు ఏమి చేసినా నోరు మూసుకోవాల్సిందే... ఏజెన్సీలో ఇసుక కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమైపోతున్నాయి. మాఫియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అడిగే వారే లేరు. ఇసుక అక్రమార్కులు ఇస్తున్న మామూళ్లకు దాసోహమై అధికార యంత్రాంగం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తుంది. ఇసుక నిల్వల వ్యవహారంలోబినామీ కాంట్రాక్టర్లు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు ప్రజలకు ఇబ్బందులు కలిగించే రీతిలో వ్యవహరిస్తున్న ఇసుక మాఫియా ఆగడాలపై చర్యలు తీసుకునే నిజాయితీ అధికారుల్లో లేకపోవడంతో ప్రజలకు శాపంలా మారింది

చాక్లెట్ డబ్బాల్లో రూ.24.5 కోట్ల కొకైన్

- శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారుల తనిఖీలు
- దోహా నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికుడి వద్ద స్వాధీనం
- క్యాబిన్ బ్యాగులో ఏడు డార్క్ చాక్లెట్ డబ్బాలు
- డబ్బాల్లో 207 క్యాప్సూల్స్ గుర్తింపు
- క్యాప్సూల్స్‌లో 4.9 కిలోల కొకైన్ ఉన్నట్లు నిర్ధారణ
- కొకైన్ విలువ రూ.24.5 కోట్లు ఉంటుందని అంచనా
- మంగళవారం రాత్రి తనిఖీల్లో పట్టుబడిన మాదకద్రవ్యం
- ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- నిందితుడిని విచారిస్తున్న డీఆర్ఐ అధికారులు



గోధుమ మద్దతు ధర రూ.2,610కు పెంపు

- రబీ పంటల మద్దతు ధరల పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- క్వింటాల్ గోధుమలపై రూ.25 పెంచిన కేంద్రం
- దిల్లీ ట్రాఫిక్ నిర్వహణకు రూ.1,789 కోట్లతో కొత్త వ్యవస్థ
- 42 మార్గాల్లో సాంకేతికత ఆధారంగా ట్రాఫిక్ నియంత్రణ
- పునరుత్పాదక విద్యుత్ కోసం రూ.1.86 లక్షల కోట్ల పథకం
- 135 గిగావాట్ల విద్యుత్‌ను తరలించేలా వ్యవస్థ
- 50 గిగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యానికి ఏర్పాట్లు
- 2032-33 నాటికి పథకం పూర్తి చేయాలని లక్ష్యం
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన అశ్వినీ వైష్ణవ్
- నేర కేసుల విచారణ వేగం పెరిగిందన్న కేంద్ర మంత్రి



హైదరాబాద్, (డీడీ9 వార్త):

రబీ పంటలకు కనీస మద్దతు ధరల పెంపుతోపాటు దిల్లీ ట్రాఫిక్ నిర్వహణ, పునరుత్పాదక విద్యుత్ సరఫరా వ్యవస్థ బలోపేతానికి కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు మిగతా 2 లో..

ఆసుపత్రి చిన్నదే.. వైద్యసేవలు ఘనమే..!



6

చాక్లెట్ డబ్బాల్లో రూ.24.5 కోట్ల కొకైన్

- శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారుల తనిఖీలు
- దోహా నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికుడి వద్ద స్వాధీనం
- క్యాబిన్ బ్యాగులో ఏడు డార్క్ చాక్లెట్ డబ్బాలు
- డబ్బాల్లో 207 క్యాప్సూల్స్ గుర్తింపు
- క్యాప్సూల్స్‌లో 4.9 కిలోల కొకైన్ ఉన్నట్లు నిర్ధారణ
- కొకైన్ విలువ రూ.24.5 కోట్లు ఉంటుందని అంచనా
- మంగళవారం రాత్రి తనిఖీల్లో పట్టుబడిన మాదకద్రవ్యం
- ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- నిందితుడిని విచారిస్తున్న డీఆర్ఐ అధికారులు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా కొకైన్ పట్టుబడింది. దోహా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడి క్యాబిన్ బ్యాగులో 4.9 కిలోల కొకైన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కొకైన్ విలువ సుమారు రూ.24.5 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

మంగళవారం రాత్రి విమానాశ్రయంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ప్రయాణికుడి క్యాబిన్ బ్యాగేజీలో ఏడు డార్క్ చాక్లెట్ డబ్బాలను అధికారులు గుర్తించారు. వాటిపై అనుమానం రావడంతో డబ్బాలను తెరిచి పరిశీలించారు. చాక్లెట్ డబ్బాల్లో 207 క్యాప్సూల్స్ ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరీక్షించగా కొకైన్ ఉన్నట్లు తేలింది. మొత్తం 4.9 కిలోల కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.24.5 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. కొకైన్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి అందించేందుకు తీసుకొచ్చారు? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరున్నారు? మాదకద్రవ్యాల రవాణాలో మరెవరైనా సంబంధం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.



సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేస్తాం..

మొదటిపేజీ తరువాయి



ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

దళితులపై చిన్నచూపా?

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్ 2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

మొదటిపేజీ తరువాయి



సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పని తీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత ఉండాలి

మొదటిపేజీ తరువాయి

పనులను ఎంపిక చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఉపాధి కోసం వచ్చే వారికి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకుల నుంచి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను సీతక్క అడిగి తెలుసుకున్నారు. పనుల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని మండల, జిల్లా అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట వేయాలని మంత్రి తెలిపారు. చేపట్టిన పనుల నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని చెప్పారు.

వీబీజీ రామ్ జీ అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలను మంత్రి వివరించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం, గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులు చేపట్టడం, పథకం అమలును పటిష్ఠం చేయడంపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికి పైగా సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు పథకం అమలును మరింత సమర్థంగా నిర్వహించాలని సీతక్క దిశానిర్దేశం చేశారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

- సీపీఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి బి.భాస్కర్

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 153వ వార్షికోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో పూలే దంపతుల చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పుట్ట వరదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి బి. భాస్కర్ మాట్లాడుతూ... కులమత దోపిడీ అంతరాలు లేని సమసమాజాన్ని స్థాపించడమే పూలే ప్రధాన లక్ష్యమని గుర్తుచేశారు. సమాజంలో వేరూనుకున్న కుల వ్యవస్థను నిర్మూలించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని, నాటి సమాజంలో ధనిక, పేద తేడా లేకుండా అందరికీ విద్యను అందించారని తెలిపారు. సావిత్రిబాయి పూలే సహకారంతో మహిళలకు పాఠశాలలను నెలకొల్పి విద్యాపంతులుగా తీర్చిదిద్దారని, బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని పేర్కొన్నారు. పూలే పోరాట స్ఫూర్తితో సత్యశోధక్ సమాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. నేటి ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని, భూమి లేని నిరుపేదలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. దోపిడీ పీడన లేని సమసమాజ స్థాపన కోసం ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, ఐఎఫ్‌టీయూ నాయకులు అల్తాఫ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సతీష్, ఐఎఫ్‌టీయూ నాయకుడు శివరాజు, లక్ష్మణ్ గౌడ్, పిఓడబ్ల్యూ నాయకురాలు పెగ్గర్ల లత తదితరులు పాల్గొన్నారు.



విమానంలో భారీ కుదుపులు.. భయపడిన ప్రయాణికులు

- అహ్మదాబాద్ నుంచి ముంబయికి వెళ్తుండగా ఘటన
- విమానం ఒక్కసారిగా తీవ్రంగా కుదుపులకు గురైన వైనం
- భయంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు
- వీడియో తీసిన ప్రయాణ ప్రభావకురాలు కామియా జానీ
- 'ఇదే నా చివరి ప్రయాణం కావొచ్చు' అంటూ సందేశం
- కుదుపులతో కూడిన ప్రయాణం ఇదే తొలిసారన్న కామియా
- విమాన వివరాలను వెల్లడించని ప్రయాణ ప్రభావకురాలు
- ముంబయి టెర్మినల్-2కు బదులు నవీ ముంబయిలో ల్యాండింగ్
- కుదుపుల నేపథ్యంలో విమానాన్ని దారి మళ్లించినట్లు వెల్లడి
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

అహ్మదాబాద్ (డీడీ9 వార్త):

అహ్మదాబాద్ నుంచి ముంబయికి వెళ్తున్న ఓ విమానం గాల్లో భారీ కుదుపులకు గురైంది. విమానం ఒక్కసారిగా తీవ్రంగా ఊగిపోవడంతో ప్రయాణికులు కొంతసేపు భయాందోళనకు గురయ్యారు. ఇదే విమానంలో ప్రయాణిస్తున్న ప్రయాణ ప్రభావకురాలు కామియా జానీ ఈ ఘటనకు సంబంధించిన వీడియోను చిత్రీకరించారు. కుదుపుల తీవ్రతను వివరిస్తూ సామాజిక మాధ్యమంలో సందేశం పెట్టారు.

తన జీవితంలో ఇంతటి కుదుపులతో కూడిన విమాన ప్రయాణం ఇదే తొలిసారి అని కామియా జానీ పేర్కొన్నారు. ప్రయాణంలో ఏదైనా జరిగితే తాను ఉండకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. 'బహుశా ఇదే నా చివరి ప్రయాణం కావొచ్చు' అంటూ తన సామాజిక మాధ్యమ ఖాతాలో సందేశాన్ని పంచుకున్నారు.

కుదుపుల కారణంగా ప్రయాణికుల్లో ఆందోళన నెలకొన్నట్లు ఆమె తెలిపారు. సాధారణంగా ముంబయిలోని టెర్మినల్2లో దిగాల్సిన విమానం.. నవీ ముంబయి విమానాశ్రయంలో దిగిందని చెప్పారు. అయితే ఈ విమానం ఏ సంస్థకు చెందినదో, విమాన సంఖ్య ఏమిటో కామియా జానీ వెల్లడించలేదు. కుదుపులు ఎంతసేపు కొనసాగాయి? విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు? ఎవరైనా గాయపడ్డారా? అనే వివరాలు కూడా తెలియాల్సి ఉంది. కుదుపులకు కారణం వాతావరణ పరిస్థితులా? గాలి వేగంలోమార్పులా?అనేఅంశంపైఅధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన వీడియో, కామియా జానీ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

కాక్‌పిట్‌లో కత్తితో దాడి.. సౌదీలో దిగిన విమానం

- దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తుండగా ఘటన
- కెప్టెన్‌పై కోపైలట్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం
- విమానంలో సుమారు 180 మంది ప్రయాణికులు
- ఘర్షణ సమయంలో భారీగా తగ్గిన విమానం ఎత్తు
- అత్యవసర సంకేతాలు పంపిన విమానం
- ప్రయాణికులు, సిబ్బంది కోపైలట్‌ను అడ్డుకున్నట్లు సమాచారం
- సౌదీ అరేబియాలోని టబుక్‌లో అత్యవసరంగా ల్యాండింగ్
- ఇద్దరు పైలట్లకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- కెప్టెన్ భారతీయుడని ఇజ్రాయెల్ మీడియా కథనాలు
- ఉగ్రదాడి కోణంలోనూ దర్యాప్తు చేస్తున్న ఇజ్రాయెల్ అధికారులు

దుబాయ్ (డీడీ9 వార్త):

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో బుధవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విమానం గాల్లో ఉండగా పైలట్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కోపైలట్ కెప్టెన్‌పై కత్తితో దాడి చేసినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం ఎత్తు ఒక్కసారిగా భారీగా తగ్గడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. చివరకు విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్‌లో అత్యవసరంగా దించారు. ఈ ఘటనపై ఉగ్రదాడి కోణంలోనూ ఇజ్రాయెల్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరింది. ఇందులో సుమారు 180 మంది ఉన్నారు. దాదాపు రెండున్నర గంటల ప్రయాణం తర్వాత కాక్‌పిట్‌లో ఘర్షణ జరిగినట్లు సమాచారం. ప్రయాణికులకు అరుపులు వినిపించాయి. అనంతరం కాక్‌పిట్‌లో రక్తపు మరకలు కనిపించినట్లు కొందరు ప్రయాణికులు తెలిపారు.

ఘర్షణ సమయంలో విమానం ఎత్తు ఒక్కసారిగా వేల అడుగుల మేర తగ్గింది. విమానం సుమారు 34 వేల అడుగుల ఎత్తు నుంచి కొద్దిసేపట్లో దాదాపు 19 వేల అడుగులకు దిగినట్లు విమానాల రాకపోకలను గమనించే సమాచారం వెల్లడించింది. దీనితో విమానంలో తీవ్ర ఆందోళన నెలకొంది.

విమానం నుంచి మొదట సాధారణ అత్యవసర సంకేతం వెళ్లింది. ఆ తర్వాత విమానాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని సూచించే సంకేతం పంపినట్లు సమాచారం. దీంతో ఇజ్రాయెల్ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధ విమానాలను కూడా రంగంలోకి దించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు తెలిపాయి. అయితే ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ప్రకారం.. ఇది సాధారణ విమాన హైజాక్ ఘటన కాదని అధికారులు భావిస్తున్నారు. కాక్‌పిట్‌లో పరిస్థితి అదుపు తప్పడంతో విమానంలో ప్రయాణిస్తున్న ఇతర పైలట్లు, కొందరు ప్రయాణికులు జోక్యం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కోపైలట్‌ను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయానికి మళ్లించారు. విమానం సురక్షితంగా అక్కడ దిగింది.

ఈ ఘటనలో కెప్టెన్, కోపైలట్ ఇద్దరూ గాయపడినట్లు సమాచారం. వారిని ఆసుపత్రికి తరలించారు. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్లు ఫ్లైదుబాయ్ తెలిపింది. కెప్టెన్ భారతీయుడని ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కత్తితో దాడి జరిగినప్పటికీ కెప్టెన్ కోపైలట్‌ను ఎదుర్కొని విమానాన్ని అదుపులో ఉంచేందుకు ప్రయత్నించినట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే కెప్టెన్ భారతీయుడన్న విషయాన్ని ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. కొన్ని కథనాలు ఆయన భారతీయుడని, మరికొన్ని భారత సంతతికి చెందిన వ్యక్తి అని పేర్కొంటున్నాయి. కోపైలట్ ఒమన్‌కు చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే పైలట్ల జాతీయత, ఘర్షణకు అసలు కారణం, కాక్‌పిట్‌లో కత్తి ఎలా చేరింది వంటి అంశాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. ఈ ఘటన వెనుక ఉగ్రవాద సంబంధం ఉందా? లేక వ్యక్తిగత కారణాలతోనే ఘర్షణ జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ ఘటనతో విమాన భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా విమానాన్ని నడిపే పైలట్ల మధ్యే ఇలాంటి ఘర్షణ చోటుచేసుకోవడం తీవ్ర భద్రతా అంశంగా మారింది. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు అసలు కారణం, బాధ్యుల పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ఈసీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి దేశవ్యాప్త ఆందోళనలు

- అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో నిరసనలు
- అక్టోబర్ 6న ఎన్నికల సంఘం కార్యాలయానికి విపక్ష ఎంపీల ర్యాలీ
- అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలవాలని నిర్ణయం
- ఓటర్ల జాబితా సవరణపై విపక్షాల అభ్యంతరాలు
- పాత ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్
- ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పత్రాలు తీసుకురావాలని ఖర్గే డిమాండ్
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఎన్నికల అక్రమాలపై ఐక్యంగా పోరాడతామన్న ఖర్గే
- ప్రజాస్వామ్యం అందరికంటే గొప్పదన్న రాహుల్ గాంధీ
- ఇండియా కూటమి భేటీలో పలు ప్రతిపక్ష పార్టీల నేతలు

న్యూఢిల్లీ (డీడీ9 వార్త):

కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసనగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఇండియా కూటమి నిర్ణయించింది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో దేశవ్యాప్తంగా పాదయాత్రలు, నిరసనలు నిర్వహించనుంది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

జిల్లాల స్థాయిలో ఈ నిరసనలు నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణపై తమ అభ్యంతరాలను రాష్ట్రపతికి వివరించనున్నట్లు నేతలు తెలిపారు.

సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు ముందు ఉన్న జాబితానే భవిష్యత్తు ఎన్నికలకు పరిగణనలోకి తీసుకోవాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కూడా డిమాండ్ చేసినట్లు సమావేశం అనంతరం వెల్లడించారు.

ఈవీఎంల పనితీరుపై కూడా ఖర్గే ప్రస్తావించారు. ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని రాహుల్ గాంధీ ఆధారాలతో వివరించినప్పటికీ ఎన్నికల సంఘం పట్టించుకోలేదని ఖర్గే ఆరోపించారు. ఇవి ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలు మాత్రమేనని, వాటిపై ఎన్నికల సంఘం, అధికార పక్షం వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం ఏ ఒక్క వ్యక్తి కంటే గొప్పదని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల ఆరోపణలను అధికార బీజేపీ ఖండిస్తోంది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేస్తోందని, ఓటర్ల జాబితా విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు రాజకీయ ఉద్దేశాలతో ఉన్నాయని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల సంఘం కూడా తన ప్రక్రియను నిబంధనల ప్రకారమే నిర్వహిస్తున్నట్లు వివిధ సందర్భాల్లో పేర్కొంది.

ప్రస్తుతం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ కొనసాగుతున్నారు. ఆయన 2025 ఫిబ్రవరి 19న 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఇండియా కూటమి తాజా నిర్ణయాలతో ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల సంఘం పనితీరు, ఈవీఎంల అంశాలపై రాజకీయ వివాదం మరింత ఉధృతమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో కూటమి భాగస్వామ్య పక్షాలు, పౌర సమాజ సంస్థలు, ఇతర వర్గాలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు.

గోధుమ మద్దతు ధర రూ.2,610కు పెంపు

మొదటిపేజీ తరువాయి



ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. నిర్ణయాల వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

202701 రబీ మార్కెటింగ్ సంవత్సరానికి గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.25 పెంచారు. దీంతో గోధుమల మద్దతు ధర రూ.2,610కు చేరింది. గోధుమలతోపాటు ఇతర రబీ పంటల మద్దతు ధరలను కూడా పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

ఢిల్లీ నగరంలో పెరుగుతున్న వాహన రద్దీని నియంత్రించేందుకు రూ.1,789 కోట్ల అంచనా వ్యయంతో కొత్త ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. దీనిలో భాగంగా వాహనాల రాకపోకలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి, దానికి అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నళ్లను మార్చే ఏర్పాట్లు చేస్తారు. మొత్తం 42 ప్రధాన మార్గాల్లో ఈ వ్యవస్థను అమలు చేయనున్నారు. పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు 'హరిత విద్యుత్ మార్గం3' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకానికి మొత్తం రూ.1,86,405 కోట్ల వ్యయం కానుంది. ఇందులో రాష్ట్రాల మధ్య కాకుండా రాష్ట్రాల పరిధిలోని విద్యుత్ ప్రసార వ్యవస్థలను బలోపేతం చేయడానికి రూ.1,36,378 కోట్లు, విద్యుత్ నిల్వ వ్యవస్థల కోసం రూ.50 వేల కోట్లు కేటాయించనున్నారు.

ఈ పథకం ద్వారా 135 గిగావాట్ల వరకు పునరుత్పాదక విద్యుత్‌ను వివిధ ప్రాంతాలకు తరలించే సామర్థ్యం ఏర్పడుతుంది. 50 గిగావాట్ల విద్యుత్ నిల్వ సామర్థ్యాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. సూర్యరశ్మి, గాలి ఆధారంగా ఉత్పత్తి మారుతూ ఉండే సమయంలో విద్యుత్ సరఫరాను సమతుల్యం చేయడంలో ఈ నిల్వ వ్యవస్థలు ఉపయోగపడతాయి. పథకాన్ని 203233 ఆర్థిక సంవత్సరం నాటికి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు దేశంలో పాత నేర చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత అమల్లోకి వచ్చిన తర్వాత కేసుల విచారణ వేగం పెరిగిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇటీవల జరిగిన ఓ హత్య కేసులో కేవలం ఎనిమిది రోజుల్లోనే తీర్పు వెలువడిందని చెప్పారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాల్లో రైతులకు సంబంధించిన మద్దతు ధరల పెంపు, దిల్లీ రవాణా వ్యవస్థ మెరుగుదల, దేశంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు విద్యుత్ ప్రసార వ్యవస్థ బలోపేతం వంటి అంశాలకు ప్రాధాన్యం లభించింది.

చిన్నారి కోసం 8వసారి రక్తదానం

- **ఆపదలో ఆపన్నహస్తం అందించిన యలమదల ప్రవీణ్**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 30 (డిడి9 వార్త)

అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు యలమదల ప్రవీణ్ ముందుకొచ్చారు. భద్రాచలం పట్టణంలోని జాబిల్లి ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న చిన్నారికి అత్యవ సరంగా ఏ బి పాజిటివ్ రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారు. దీంతో రక్తం కోసం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌ను కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు రక్త దాత కోసం ప్రయత్నించగా, ట్రస్ట్ సభ్యుడు యలమదల ప్రవీణ్ స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో 8వసారి ఏ .బి పాజిటివ్ బ్లడ్ రక్త దానం చేసి చిన్నారికి అండగా నిలిచారు. ఆపద సమయంలో స్పందించి రక్తదానం చేసిన ప్రవీణ్‌కు చిన్నారి తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాపాయ సమయంలో రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను ని లబెట్టవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ట్రస్ట్ ప్రతినిధులు కోరారు.



మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా తుమ్మల చెరువు ఆయకట్టుకు గోదావరి జలాలు..

- **పంట పొలాలకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**
- **హర్షం వ్యక్తం చేసిన ఆయకట్టు రైతులు.**

మణుగూరు. సెప్టెంబర్ 30 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం లోని మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగే షన్ ద్వారా గోదావరి జలాలను తుమ్మల చెరువు ఆయకట్టుకు తరలించి, అక్కడి నుంచి తూముల ద్వారా పంట పొలాలకు సాగునీటిని విడుదల చేసే కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మె ల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా తూముల లాకులు తీసి గోదావరి జలాలను పంట పొలాలకు విడుదల చేశారు. మా రెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి నీటిని తుమ్మల చెరువులోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి తూముల ద్వారా ఆయకట్టు పరిధి లోని పంట పొలాలకు సాగునీరు అందేలా నీటి విడుదల ప్రక్రియను ఎమ్మెల్యే పరి శీలించారు.గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు చేరడంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గోదావరి జలాలను ఆయకట్టు ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావడం వల్ల పంటల సాగుకు మరింత భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా నీటి వి డుదలకు సంబంధించిన ఏర్పాట్లను అధి కారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పరి శీలించారు. తూముల ద్వారా ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు సక్రమం గా చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మారెళ్ళపాడు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలు తుమ్మల చెరువు ఆయకట్టుకు చేరి, తూముల లాకులు తెరిచి పంట పొలాలకు నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.





సీనియారిటీ ప్రాతిపదికన 24 మందికి క్వార్టర్లు

- **రామగుండం ఏరియా-1లో క్వార్టర్ కౌన్సెలింగ్.. 121 దరఖాస్తుల పరిశీలన**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):

రామగుండం ఏరియా 1లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కేటగిరీ1 నుంచి కేటగిరీ6 వరకు ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహిం చారు. క్వార్టర్ అలాట్‌మెంట్ కమిటీ ప్రతి నిధిగా ఆర్జీ1 పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి హాజరై కౌన్సెలింగ్ నిర్వహిం చారు.
డీటైప్, టీ2, ఎండీ, ఎస్‌టీ2, ఐబీ కాలనీ, శారదానగర్, బస్టాండ్ కాలనీ, జీఎం ఆఫీస్ కాలనీ, పవర్‌హౌస్ కాలనీ, జవ హర్‌నగర్, తిలక్‌నగర్‌లోని 325 క్వార్ట ర్లకు 121 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి సీనియారిటీ ప్రాతిపదికన అధికారులు, యూనియన్ ప్రతినిధుల సమక్షంలో 24 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు.
కార్మికుల సంక్షేమంలో భాగంగా ఖాళీగా ఉన్న క్వార్టర్లను గుర్తించి దశలవారీగా కౌ న్సెలింగ్ ద్వారా కేటాయిస్తామని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు.
కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, సీనియర్ పీఓ ఫిరో జ్‌ఖాన్, ఆఫీస్ పీఓ దేవచారి, సాయినాథ్, సెక్యూరిటీ సిబ్బంది శ్రీకాంత్, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం.. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

- **అశ్వాపురంలో స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..**
- **పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు. సెప్టెంబర్ 30(డి డి 9వార్త)

తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగ తి కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్య తనిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ షెడ్యూ ల్డ్ తెగల (ST) సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు.
అశ్వాపురం మండలంలోని రైతు వేదిక సందు బుధవారం నాడు నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పినపాక నియోజక వర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మం డలంలోని 24 గ్రామపంచాయతీలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 23 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను అందజే శారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంక టేశ్వర్లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పౌర సరఫరాలు, ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం అవుతోందని తెలిపారు.
అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొన సాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 23 మంది లబ్ధిదారులకు రూ.1,00,116 చొప్పున ఆర్థిక సహాయం అందించడం పేద కుటుంబాలకు ఎంతో భరో సానిస్తోందని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆడబిడ్డల వివాహ సమయంలో కుటుంబా లపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయ ని అన్నారు.
ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్ర భుత్వం ముందుకు సాగుతోందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, MRO, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచు లు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదా రులు తదితరులు పాల్గొన్నారు.





జనగామసావిత్రి భాయి ఫూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందచేత

జనగామ సెప్టెంబర్30(డిడి9) వార్త

జనగామసావిత్రి భాయి ఫూలే ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో జనగామ జిల్లా కేంద్రం లో నెల రోజుల నుండి కానిస్టేబుల్, ఎస్సై పరీక్ష ల కు సిద్ధమవు తున్న వారికి థియరీ మరియు ఫిజికల్ టెస్ట్ ల కు కోచింగ్ ఇస్తున్నాము అని ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కరుణాకర్ అన్నారు.
పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఎస్ ఎస్ యు ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మరియు రాచకొండ ఫౌండేషన్ వ్యవస్థాపకు డు రాచకొండ ప్రశాంత్ గారి సహకారంతో ఈరోజు 30 మంది విద్యార్థులకు ఈరోజు రెండు లక్షల 25 వేల రూపాయల విలువగల స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడమై నది అని అన్నారు.
ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన దాత రాచకొండ ప్రశాంత్ గారు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు జాబు సాధిస్తే వారికి 50 వేల రూపాయల నగదు ఇచ్చి ప్రోత్సహిస్తానని తెలిపారు మరియు ప్రిలిమ్స్ మరియు ఫిజికల్ ఈవెంట్స్ పాస్ అయిన వారికి ఫైనల్ ఎగ్జామ్ కోసం గజ్వేల్ లో ఉచిత శిక్షణ మరియు వసతి కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ నెంబర్ చిలువేరు అభి గౌడ్, ఐదో వార్డ్ కౌన్సిల ర్ భాస్కర్, నర్సింగరావు, శ్రీనివాస్, జేరిపోతుల రాజశేఖర్, రమేష్, రామకృష్ణ, నవీన్, గొంగళ్ళ కుమార్ మరియు అభ్యర్థులు పాల్గొన్నారు.






సమితి సింగారం లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక పిచ్చి పట్టి మాట్లాడుతున్న మాజీ జెడ్పిటిసి...

- **మీ హయం లో పంచాయితి ప్రజలను దోచుకొని దాచుకొని ఇప్పుడు దొంగ నిరసనలు.**
- **దమ్ముంటే అభివృద్ధి పై బహిరంగ చర్చకు సిద్ధం సర్పంచ్ కలబోయిన మాధవరావు**

మణుగూరు. సెప్టెంబర్ 30 (డి డి 9వార్త)

మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బుధవారం నాడు సమితి సింగారం గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపస ర్పంచ్ గాండ్ల సురేష్‌లు పాల్గొని మాట్లాడుతూ, గతం 10 సంవత్సరాలు పంచాయతీని పట్టిం చుకోకుండా దోచుకు తిన్న పాలకులు ఇప్పుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారధ్యం లో 10 నెలలుగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తు దొంగ నిరసన కార్యక్రమలు చేయడం బిఆర్ఎస్ నాయకుల సిగ్గుమాలిన చర్య అని వారు పేర్కొన్నారు.
గతంలో జెడ్పిటిసి గా పనిచేసిన నీవు పం చాయతీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు సిద్ధమా..? నీ హయాంలో జరిగిన అభివృద్ధికి, మా హయాంలో జరుగుతున్న అభి వృద్ధిపై చర్చకు మేము సిద్ధం ప్రజలను పిండి, పిప్పి చేసి దోచుకున్న నీచ చరిత్ర నీది, నీ ప్రభు త్వానిది. పంచాయితీ ప్రజలు వరద ముంపుకు గురికాకుండా ఉండటానికి సుమారు 70 లక్షల రూపాయలతో కోడిపుంజుల వాగు పూడికతిత అలాగే ప్రజలకు అందుబాటులో సంతను ఏర్పాటు చేయడం,
అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిర మ్మ ఇల్లు,రైతు రుణమాఫీ, రైతు భరోసా,200 యూనిట్ల కరెంట్,
కోట్ల రూపాయల నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైన్ నిర్మాణం చేయడం జరుగుతున్నది. అలాగే పారిశుధ్య పనులకు మూడు ట్రాక్టర్ల ద్వారా చెత్త నిర్మూలించడం జరుగుతుంది,
సుమారు 5 కోట్ల రూపాయలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుంది.
కోట్ల రూపాయల నిధులతో పంచాయతీ పరిధిలో వైద్యం అభివృద్ధి చేయడం తో పాటు కోట్ల రూపాయల నిధులతో పంచాయతీ పరిధిలో నాణ్యమైన విద్యను ప్రజలకు అందించి విద్యాభివృద్ధి చేయడం జరుగుతుం ది, కావాలని ప్రజలను మోసం చేయాలనీ, తప్పుదోవ పట్టించాలని అక్కసుతో నిరసన పేర్లతో పబ్లిసిటీ కావాలని చూస్తున్న నాయకు లారా ఖబడ్దార్ అని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మా ధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్,వార్డ్ సభ్యులు మాధడి రాజేష్, కోలపిన్ని మానస,షేక్ రహీమ్ పాషా, ఊకే కృష్ణవేణి, బిరుదు రాజు శ్రీదేవి, బానోత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.




రోజులు, నెలలు గడిచినా చెత్తను ఎత్తే పరిస్థితి లేదు

- **మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు.**
- **సమితిసింగారం పంచాయతీలో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం.**
- **పంచాయతీ కార్యదర్శి కి వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు.**

మణుగూరు. సెప్టెంబర్ 30(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని మేజర్ పంచాయతీ అయిన సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడ చూసినా చెత్త చెదారం పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి అని మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు అన్నారు. ప్రధాన రహదారుల ను మాత్రమే పట్టించుకుంటే సరిపోదని,అంత ర్గత రహదారులు, మరియు వీధులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ఆయన పేర్కొన్నా రు. చాలా ఏరియాలలో సరైన సైడ్ డ్రైన్ లు లేవని, ఉన్నా కూడా వాటిని శుభ్రం చేసేవారు లేక చెత్త చెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్ల మీదకు వస్తున్న పరిస్థితి ఉందని,
పంచాయతీని మొత్తం మురికికూపంగా మార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారుల వెంట ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని అన్నారు.సమితి సింగారం గ్రామపంచాయతీ లో పారిశుధ్యం పై పాలకవర్గం దృష్టి సారించాలని,లేకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిప త్రాన్ని పంచాయతీ కార్యదర్శి కి బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మ ణ్, అడపా అప్పారావు, మరియు పట్టణ ముఖ్య నేతలు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశం..

- **పలు అంశాలపై చర్చించిన సహకార సంఘం అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు.**

మణుగూరు. సెప్టెంబర్ 30 (డి డి 9వార్త)



భద్రాద్రి జిల్లా, మణుగూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జనరల్ బాడీ సమా వేశాన్ని నిర్వహించారు.
ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రానున్న వర్షాకాలం లో ఏర్పాటు చేయబోయే దాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. అలాగే రైతులకు ఇవ్వబోయే కొత్త రుణాలకు కూడా బడ్జెట్ అవసరం ఉన్నందున ఖమ్మం సెంట్రల్ బ్యాంకు సీఈఓ గారి నుండి పర్మిష న్ తీసుకువచ్చి అపకాశం ఉన్న మేరకు కొత్త రుణాలు కూడా ఇవ్వటం కొరకు ప్రయత్నం చేస్తామని అన్నారు.
అలాగే ధాన్యం సీజన్ మొదలైన తర్వాత ఇం తకుముందు రైతులకు ఇచ్చిన రుణాలను కూడా సకాలంలో వసూలు చేయాలని స్పష్టం చేశారు.
రుణాల వసూళ్లు ఆ పరిధిలో ఉన్నటువంటి సొసైటీ డైరెక్టర్స్ శ్రద్ధ వహించి త్వరగా ఎక్కువ మొత్తంలో రుణాలు వసూలు అయ్యేవిధంగా శ్రద్ధ వహించాలి అని అన్నారు.ఈ సంవత్స రం దాన్యం సేకరించటం కొరకు మణుగూరు మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. సమితి సింగారం, మణుగూరు, చిన్నరాయి గూడెం, తిర్లాపురం,రామానుజవరం, గొల్ల కొత్తూరు. ఈ కేంద్రాల్లో దాన్యం కొనుగోలు చేయబడుతుందని తెలియజేశారు.
ఇంకా రైతుల సౌకర్యార్థం ఏమైనా కొత్త ధాన్యం కొనుగోలు కేంద్రాలు అవసరం ఉంటే మరల డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్ (DCO) గారి పర్మిషన్ తో కొత్త ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రయత్నిస్తామన్నారు.
అనంతరం ఈమధ్య కాలంలో అనారోగ్యంతో చనిపోయిన సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దొండేటి రామ్మోహన్ రావు గారి ఆత్మకు శాంతి చేకూ రాలని సంతాపం వ్యక్తం చేశారు.
ఈ సమావేశంలో పిన్నమనేని మాధవి,గుండ గాని నాగేశ్వరరావు, పప్పుల ప్రసాద్, గుమ్మల రాంబాబు, కురం సతీష్, దాచేపల్లి శంకర్, సీఈవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో గైనకాలజిస్ట్, పిడియాట్రిస్ట్ వైద్యులను నియమించాలి

- **కొత్తగూడెం సింగరేణి ప్రధాన వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్. ఆర్. రాజ్ కిరణ్ కుమార్ కు..**
- **వినతి పత్రాన్ని అందచేసిన ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

మణుగూరు. సెప్టెంబర్ 30 (డి డి 9వార్త)

మణుగూరు సింగరేణి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధన కోసం కష్టపడి పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లను నియమించడంతో పాటు పలు వైద్య సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ మణుగూరు ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కొత్తగూడెం సింగరేణి వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. రాజ్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో అధిక సంఖ్యలో యువ కార్మికులు విధులు నిర్వహిస్తున్నందున వారి కుటుంబాలకు అవసరమైన వైద్య సేవలను స్థానిక సింగరేణి వైద్యశాలలో అందుబాటులో కి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్, పీడియాట్రిషియన్ వైద్యులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు.

అదేవిధంగా వారానికి ఒకసారి దంత వైద్య నిపుణుల సేవలు, ప్రతి 15 రోజులకు ఒకసారి చర్మ వైద్య నిపుణుల సేవలు, నెలకు ఒకసారి ఆర్థోపెడిక్ సర్జన్ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. రక్త పరీక్షలకు సంబంధించి పూర్తి ఆటోమేటిక్ సెల్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మణుగూరు ఏరియాలోనే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన పలు రకాల పరీక్షలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ, గైనకాలజిస్ట్ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల వాటి పూర్తి ప్రయోజనం



కార్మిక కుటుంబాలకు అందడం లేదని నాగెల్లి తెలిపారు. చిన్నచిన్న వైద్య పరీక్షల కోసం కూడా గర్భిణీ స్త్రీలు కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల వారికి అదనపు ప్రయాణ భారం, సమయం వృథా అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన గైనకాలజిస్ట్‌ను నియమించాలని కోరారు.ఏరియాలో థైరాయిడ్ సంబంధిత కేసులు పెరుగుతున్న నేపథ్యంలో థైరాయిడ్ పరీక్షల రిపోర్టులు సకాలంలో అందేలా పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన ఇతర వైద్య సమస్యలను కూడా సీఎండీ దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కార మార్గం చూపాలని విజ్ఞప్తి చేశారు.సంస్థ ప్రగతి, కార్మిక సంక్షేమం దృష్ట్యా టిబిజికెఎస్ ప్రతిపాదించిన వైద్య సేవల అంశాలపై చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. రాజ్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిగేల నాగేశ్వరరావు, పి.కె. నాగరాజు, ప్రసన్న కుమార్, కోటేశ్వరరావు, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

PRTU వెంకటాపురం మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..

- **మండల అధ్యక్షుడిగా బి. శ్రీనివాస్.. ప్రధాన కార్యదర్శిగా కె. వీరన్న..**
- **PRCపై తక్షణ నిర్ణయం తీసుకోవాలి.. CPS రద్దు చేయాలి: జిల్లా అధ్యక్షుడు యాకూబ్ రెడ్డి డిమాండ్..**

సెప్టెంబర్ 30 డిడి9 వార్త వెంకటాపురం.

వెంకటాపురం మండలంలో PRTU నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండలంలోని శ్రీనివాస్ నివాసంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మండల అధ్యక్షుడిగా బి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె. వీరన్న ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం వివరాలు:

అసోసియేట్ అధ్యక్షులుగా ఎం. సత్యనారాయణ, ఐ. మాధవరావు; మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా బి. విజయశ్రీ, జె. సుజాత; ఉపాధ్యక్షులుగా కె. విజయ్, ఏడుకొండలస్వామి; మహిళా ఉపాధ్యక్షులుగా టి. వెంకటరమణ, జె. కళ్యాణి; కార్యదర్శులుగా ఐ. రాజేశ్వరరావు, ఎల్. రమేష్; మహిళా కార్యదర్శిగా సిహెచ్. షర్మిల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ ఎన్నికల కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు యాకూబ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం, జిల్లా మాజీ అధ్యక్షుడు దేవుల పల్లి సత్యనారాయణ, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన శ్రీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై డిమాండ్లు

అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. PRC నివేదికను వెంటనే తెప్పించి కనీసం 50 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, CPS విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని స్పష్టం చేశారు.

317 జీవో ద్వారా ప్రభావితమైన ఉపాధ్యాయులకు సంబంధించి 190 జీవోను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 19 మంది లోపు విద్యార్థులున్న చోట కూడా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడం, వారి హక్కులను పరిరక్షించడం, విద్యారంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం PRTU నిరంతరం కృషి చేస్తుందని సమావేశంలో తెలిపారు.





మూడు దశాబ్దాల పోలీస్ సేవకు ఘన వీడ్కోలు..

- **విధి నిర్వహణలో మచ్చలేని సేవలు..**
- **కానిస్టేబుల్ గా ప్రస్థానం ఏఎస్ఐగా పదవీ విరమణ..**

సెప్టెంబర్ 30:డిడి9 వార్త వెంకటాపురం.



పోలీస్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, ప్రజల భద్రతకు సేవలందించిన బోదబోయిన పురుషోత్తం పదవీ విరమణ సందర్భంగా ములుగు జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఆయన సుదీర్ఘకాలం అందించిన సేవలను పోలీస్ అధికారులు అభినందిస్తూ, భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

1990లో కానిస్టేబుల్‌గా ప్రస్థానం.. ఏఎస్ఐగా పదవీ విరమణ!

బోదబోయిన పురుషోత్తం 1990 బ్యాచ్‌లో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. ధర్మసాగర్, వరంగల్, హన్మకొండ, పస్రా, మైబాద్, మట్టెవాడ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఆయన, అనంతరం ఏఎస్ఐగా ఎదిగారు. భూపాలపల్లి, ములుగు, వెంకటాపురం, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో సేవలందించారు. విధి నిర్వహణలో చూపిన సేవలకు గుర్తింపుగా 2021లో సేవా పతకాన్ని అందుకున్నారు. 2022 నుంచి వాజేడు-వెంకటాపురం ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు.

విధినిబద్ధత, క్రమశిక్షణ పోలీస్ సిబ్బందికి ఆదర్శం: ఎస్పీ

ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ కేకన్ సుదీర్ రామనాథ్ ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం అంకితభావంతో పనిచేసిన పదవీ విరమణ పొందిన సిబ్బంది సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విధినిర్వహణలో వారు ప్రదర్శించిన క్రమశిక్షణ, నిబద్ధత, అనుభవం ప్రస్తుత పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి కృషి ఎంతో కీలకమని అన్నారు.

పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి అందించిన సేవలకు అది గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొంటూ, పురుషోత్తం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, శ్రీకాంత్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, ఆర్ఎస్ఐ నిర్మల, ములుగు జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ఈటల ధ్వజం

- **బకాయిలు వెంటనే చెల్లించాలి.. కార్మికుల హామీలు అమలు చేయాలి**
- **లాభాల వాటా ప్రకటించాలి.. ఓసీపీల్లో కార్మికుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఈటల రాజేందర్**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):

సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు.సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆయన ఆరోపించారు. సింగరేణికి రావాల్సిన ప్రభుత్వ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రామగుండం నియోజకవర్గంలోని ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో బీజేపీ నాయకుల స్వాగత కార్యక్రమం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు అధిక ప్రాధాన్యం లభిస్తోందని, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

గత ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఈటల విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా హామీల అమలుపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతులకు విద్యుత్ సరఫరా, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు వంటి అంశాలపైనా ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని, కాళేశ్వరం లోపాలను సరిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి, ముసుకుల భాస్కర్‌రెడ్డి, తడగొండ నరసయ్య, ఆకుల శశికుమార్, బోడకుంటి సుభాష్, మెరుగు నరేష్‌గౌడ్, సులువ పద్మ, ఎల్తూరి సరిత, ఎల్తూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థులారా.. హక్కుల సాధన కోసం కదలిరండి..

- **అక్టోబర్ 6న చలో ఉస్మానియా యూనివర్సిటీ.. ఎంఎస్ఎఫ్ బహిరంగ సభను విజయవంతం చేయాలి..**
- **వెంకటాపురం మండల MRPS అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ పిలుపు..**

సెప్టెంబర్ 30 డిడి9 వార్త వెంకటాపురం.

మాదిగ విద్యార్థుల భవిష్యత్తు, జాతి అస్తిత్వం, సామాజిక న్యాయం కోసం విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమంలోకి రావాలని వెంకటాపురం మండల MRPS అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న MSF బహిరంగ సభకు ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మాదిగ విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

బుధవారం వెంకటాపురం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగ జాతి హక్కుల సాధన కోసం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాట స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని అన్నారు. హక్కుల పరిరక్షణ, విద్యా అవకాశాలు, సమానత్వం, ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. “మన కోసం.. మన భవిష్యత్తు కోసం.. మన జాతి అస్తిత్వం కోసం.. హక్కుల సాధన కోసం ఒక్కటై కదలిరండి!” అని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. కుల వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణం కోసం ప్రతి విద్యార్థి సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.మంద కృష్ణ మాదిగ పిలుపునకు స్పందించి అక్టోబర్ 6న నిర్వహించనున్న చలో ఉస్మానియా కార్యక్రమంలో మాదిగ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఐక్యతను చాటాలని యాసం రమేష్ మాదిగ కోరారు.



ఈ సమావేశంలో MRPS సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ, కోగిల మల్లికార్జున్ మాదిగ, వేల్పుల మల్లేష్ మాదిగ, తోకల అంజి మాదిగ, కోగిల సృజన్ మాదిగ, గుద్దేటి నాగరాజు మాదిగ, కోగిల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



హక్కులపై అవగాహన..

సమానత్వమే లక్ష్యం

- **జనగామలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):

రామగుండం నగరపాలక సంస్థ 6వ డివిజన్ జనగామ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దళితులపై ఎక్కడైనా వివక్ష కొనసాగితే సహించరాదని, దళితవాడల్లో డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్య సౌకర్యాలతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. గ్రామంలోని గుడి మాన్యం భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద విద్యార్థులకు ఇంటర్ అనంతరం ఉన్నత విద్య కోసం హాస్టల్ సౌకర్యం కల్పించే అంశంపై కూడా అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామణి రమేష్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కవ్వంపల్లి సతీష్, హాస్టల్ సంక్షేమ అధికారి తిరుపతమ్మ, ఆర్ఐ రాజేందర్, జీపీఓ సురేష్, వార్డు అధికారి చిలుముల ఐలయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జనగామ రాయలింగు, మాజీ కౌన్సిలర్ జనగామ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీపీసీలో ఉద్యోగులకు ఘన వీడ్కోలు

- **పదవీ విరమణ పొందిన చందన్‌కుమార్ సమంత సహా ముగ్గురు ఉద్యోగులు**
- **అంబేడ్కర్ పార్కులో మొక్కలు నాటి.. హెచ్ఆర్ ఆడిటోరియంలో సన్మానం**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):

ఎన్టీపీసీ రామగుండం అండ్ తెలంగాణలో పదవీ విరమణ పొందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ అండ్ టీ చందన్‌కుమార్ సమంత, డిప్యూటీ మేనేజర్ మెకానికల్ మెయింటెనెన్స్-బాయిలర్ రమేష్ రౌతు, ఇంజినీర్ ఆపరేషన్-ఎస్ఎల్‌పీఎస్ ఫ్యూయల్ హ్యాండ్లింగ్ పోగుల స్వామిలకు బుధవారం ఘన వీడ్కోలు పలికారు.

ఎన్టీపీసీలో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన చందన్‌కుమార్ సమంత వివిధ హోదాల్లో సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అధికారులు కొనియాడారు. ఆయన నాయకత్వం, నిబద్ధత, అనుభవం సంస్థకు విలువైన సేవలుగా నిలిచాయని పేర్కొన్నారు.

పదవీ విరమణ కార్యక్రమంలో భాగంగా పీటీఎస్‌లోని అంబేడ్కర్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అడ్మిన్ బిల్డింగ్‌లోని హెచ్ఆర్ ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.





అభివృద్ధి పనులకు వేగం పెంచాలి

- **పాత విద్యుత్ స్తంభాల తొలగింపునకు ఆదేశం.. యూజీడీ, సీసీ రోడ్డు పనుల పరిశీలన**
- **ఇందిరమ్మ ఇళ్లు, అల్పాహార పథకం ఏర్పాట్లపై మేయర్ మహంకాళి స్వామి సమీక్ష**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):



రామగుండం మేయర్ మహంకాళి స్వామి బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కళ్యాణ్‌నగర్-అడ్డగుంటపల్లి రహదారిపై అడ్డుగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. వచ్చే సోమవారం నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

50వ డివిజన్ గాంధీనగర్‌లో రూ.12.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న యూజీడీ పనులను ప్రారంభించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. 46వ డివిజన్ సంజయ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించి, సర్వే చేసి ప్లాటింగ్ పూర్తి చేయాలని తహసీల్దార్ రవీందర్‌ను ఆదేశించారు. 47వ డివిజన్ సాధనానగర్‌లో యూజీడీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.అనంతరం అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానున్న అల్పాహార పథకం ఏర్పాట్లను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మల్లేశంతో కలిసి సమీక్షించారు. కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలి

జనగామ సెప్టెంబరు 30(డిడి 9వార్త) బ్యూరో

కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న 300-320 పడకల ఆసుపత్రి తోపాటు వివిధ విద్యాసంస్థల హాస్టళ్లు, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని దోబీ పోస్టులను అర్హులైన రజకులతోనే భర్తీ చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి కోరింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గురుకుల, ఫార్మసీ, పాలిటెక్నిక్, బీటెక్ కళాశాలల హాస్టళ్లలో బట్టలు ఉతికే కాంట్రాక్టులను కూడా రజకులకే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రజకుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగులయ్య, వెంకటేష్, లక్ష్మీ, లలిత, వెంకటప్ప, ప్రభాకర్, అశోక్, అనిల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో తీజ్ పండుగ నిషేధించాలి

- **తుడుం దెబ్బ గ్రామ కమిటీ అధ్యక్షులు సునీల్**
- **మేడారం కేంద్రగా గడిగా సునీల్ అధ్యక్షతన నిర్వహణ చేయడం జరిగింది**

తాడ్వాయి డిడి9 వార్త

ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ ముఖ్య అతిథిగా హాజరు కావడం, వారు మాట్లాడుతూ 'మేడారం జాతర' రాష్ట్ర పండుగగా 1996లో గుర్తించింది ఇక్కడ కోయ ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలతో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో ప్రతి రెండు ఏళ్లకు ఒక్క సారి అధికారికంగా నిర్వహణ చేయడం జరుగుతుంది. మేడారం , ఆదివాసిలకు సంస్కృతి కేంద్రంగా ఉంది మేడారంనీ గిరిజన పుణ్య క్షేత్రంగా కొలవడం జరుగుతుంది మేడారంలోకీ అక్రమంగా లంబడాలు వలస వచ్చి అడవి ఆక్రమణ చేసి నివాసం ఏర్పాటు చేసుకొని మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర సంప్రదాయాలకు విరుద్ధంగా తీజ్ పండుగ చేయడం సరికాదని, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మేడారం కోయ సాంస్కృతికి కేంద్రం కనుక ఇక్కడ కోయ సాంస్కృతి విచ్చిన్నం చేయడానికీ తీజ్ పండుగ చేయడం విరుద్ధంగా ఉంది కనుక తీజ్ పండుగ కోయలను రెచ్చ గొట్టడానికే చేస్తున్నారు అన్నారు దీనికి మద్దతుగా మేడారం తుడుం దెబ్బ కార్యదర్శి సిద్ధబోయిన రవి సిద్ధబోయిన జనార్ధన్ గడిగ అనిల్ ఆలం కృష్ణార్జున్ ఆలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బాలికోన్నత పాఠశాలలో మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటు

భద్రాచలం టౌన్,సెప్టెంబరు 30(డీడీ9వార్త)

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, భద్రాచలంలో విద్యార్థులకు గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు సులభతరమైన పద్ధతుల్లో గణితాన్ని బోధించేందుకు మ్యాథ్స్ ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటమల్ల రమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ల్యాబ్ ను ఆర్థిక సహకారం అందించిన శ్రీ దేశప్ప ప్రారంభించారు.
మ్యాథ్స్ ల్యాబ్ ఏర్పాటుకు గణిత ఉపాధ్యాయులు ఎస్ .కె. జరీనాబి, ఎన్ . సుమలత ఆర్థిక సహకారంతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ దేశప్ప మాట్లాడుతూ విద్యార్థులకు గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు మ్యాథ్స్ ల్యాబ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు రూపొందించిన గణిత చార్టులు ఆకట్టుకునేలా ఉన్నాయని ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయురాలు తోటమల్ల రమ మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు జరీనాబి, సుమలత ఎంతో శ్రమించి ల్యాబ్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యార్థులు ల్యాబ్ ను సద్వినియోగం చేసుకుని గణితంలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

నవాబుపేట్ సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

నవాబుపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం చైర్మన్ నర్సింలు అధ్యక్షతన నిర్వహించారు. సహకార సంఘం సాధించిన ప్రగతి భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికలు రైతుల సంక్షేమం కోసం అందరు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులు అందరు సుదీర్ఘంగా చర్చించారు. మెరుగైన సేవలు అందించడంతో పాటు సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన పలు కీలక తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి మాజీ ఎంపిటిసిలు అనంతయ్య బాలమ్మ సిద్దిరామిరెడ్డి కృష్ణయ్య డైరెక్టర్లు ప్రతాప్ వెంకటేష్ శశిధర్ రెడ్డి గోపాల్ గౌడ్ చెన్నయ్య వివిధ గ్రామాల సర్పంచులు వివిధ గ్రామల రైతులు పిఏసిఎస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల కృషికి సింగరేణి చేయూత!

- **వాయిద్య పరికరాల కోసం ప్రత్యేక బడ్జెట్.. అన్ని ఏరియాల్లో అందించేందుకు యాజమాన్యం చర్యలు**
- **స్పందించిన యాజమాన్యానికి కళాకారుల కృతజ్ఞతలు: ఆర్జీ-1 కల్చరల్ కమిటీ కెప్టెన్ పొన్నాల శంకర్**

పెద్దపల్లి బ్యూరో, సెప్టెంబరు 30 (డీడీ9 వార్త):



సింగరేణిలో పనిచేస్తున్న కళాకారులకు సంగీత, వాయిద్య పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్న యాజమాన్యానికి ఆర్జీ1 ఏరియా కల్చరల్ కమిటీ కెప్టెన్ పొన్నాల శంకర్, సీనియర్ కళాకారుడు చీకటి అంజయ్యతో పాటు ఆర్జీ1 ఏరియా కళాకారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
కళాకారుల ప్రతిభను గుర్తించి, వారి కళా ప్రదర్శనలకు మరింత ప్రోత్సాహం అందించే దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. సంగీత వాయిద్య పరికరాల కొనుగోలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సింగరేణిలోని అన్ని ఏరియాల్లో కళాకారులకు అవసరమైన పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సింగరేణి కళాకారుల సమస్యలను సెప్టెంబర్ 17న వినతిపత్రం ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సి&ఎండీ స్థాయి నుంచి జీఎం స్థాయి వరకు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసి, కళాకారులకు వాయిద్య పరికరాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ కృషికి సానుకూల స్పందన లభించిందని పేర్కొన్నారు.
కళాకారుల సమస్యల పరిష్కారం కోసం, వాయిద్య పరికరాల కోసం గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ తరపున కృషి చేసిన అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లకు కళాకారుల తరపున హృదయపూర్వక కళాభివందనాలు తెలిపారు. కళలను, కళాకారులను ప్రోత్సహిస్తూ సింగరేణిలో సాంస్కృతిక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా అందరి సహకారం కొనసాగాలని వారు కోరారు. "కళాకారుల ఐక్యత-కళల అభివృద్ధి-సింగరేణి సాంస్కృతిక వైభవం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

గర్భిణీలు, బాలింతలకు పౌష్టికహారంపై మహిళలకు అవగాహనా

- **శేఖపూర్ గ్రామంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం**

జహీరాబాద్ సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

సంగారెడ్డి జిల్లా శాసన సభ పరిధి మండలంలోని శేఖపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ సునీత బాయి, సూపర్ వైజర్ సుశీల లు హాజరై కార్యక్రమం గురించి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆకు కూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, తృణ ధాన్యాలు, వివిధ రకాల వితనాలతో కూడిన పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేసి, వాటి ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు సరైన ఆహారపు అలవాట్లు పాటించాలని అవగాహన కల్పించారు. చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆహారం, గుడ్ల గురించి క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఫహేమీద బేగం, హాజీరా బేగం, రామ్, మైకిల్, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ గరిసె రవి ఆధ్వర్యంలో సర్వ సభ్యసమావేశం

వలిగొండ సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ అర్థ సంవత్సర సమావేశం బుధవారం నిర్వహించారు .పిఎ సిఎస్ చైర్మన్ గరిసె రవి అధ్యక్షతన జరిగినఈ సమావేశంలో గత ఆరు నెలల ఆదాయ వ్యయాలు బకాయిల వివరాలు, రైతులకు ఇచ్చిన రుణాలు, ఎరువుల సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మ గరిసె రవి మాట్లాడుతూ రైతుల సంక్షేమే పిఎ సిఎస్ లక్ష్యమని రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంలో పిఎసిఎస్ ముందుంటుందని అన్నారు బకాయిలు ఉన్న రైతులు సకాలంలో చెల్లించి సహకరించాల కోరారు. సంఘం అభివృద్ధికి అందరూ కృషి చేయాల పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పి ఎ సి ఎస్ డైరెక్టర్లు, సిబ్బంది, రైతుల పాల్గొన్నారు. గత అర్ధ సంవత్సరంలో జరిగిన ఖర్చులు వసూలైన బకాయిలు, ప్రభుత్వం నుండి వచ్చిన నిధు వివరాలను సి ఈ ఓ వివరించారు. రాబోయే రోజుల్లో రైతులు మరిన్ని సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆ కార్యక్రమంలో వైస్ చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక సర్పంచ్ కుంబ వెంకట్ పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్, పాశ సత్తిరెడ్డి, ఉప సర్పంచ్ మలుగ మాధవి, బత్తిని లింగయ చెరుకు శివయ్య, వలిగొండ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కేర్చపల్లిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వలిగొండ సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని కేర్చపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కేర్చపల్లి గ్రామానికి చెందిన మద్దెల వెంకటేశం ను వయసు 65 సంవత్సరాలు, ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చెవులలో నుండి రక్తం కారుతూ అపస్మారక స్థితిలో ఉన్నారు. చికిత్స నిమిత్తం వలిగొండ 108 వాహనంలో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించామని 108 సిబ్బంది తెలిపారు.





అంబేద్కర్ భవన్ కు రూ.50 లక్షలు మంజూరు చేయాలి

- **మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి**

భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 30 (డీ డీ 9 వార్త)

భగవాన్ దాస్ కాలనీలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవన్ పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి డిమాండ్ చేశారు. భద్రాచలం స్థానిక అంబేద్కర్ సెంటర్ లో మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అవసరమైన నిధులు కేటాయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాకోబ్ మధుసూదన్ , కూరపాటి రవీందర్ , లక్ష్మి, రమాదేవి, కుమారి, కిరణ్ , కాలువ సుందరం మాస్టర్ , మోతుకూర ఆశీర్వాదం, మంచాల నాగభూషణ్ , దేగల నవీన్ , దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం అక్టోబర్ 5న మహాధర్నా

భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 30 (డీ డీ 9 వార్త)


ఆదివాసీల భూమి, హక్కులు, ఉద్యోగాలు, చట్టపరమైన రక్షణ, గౌరవప్రదమైన జీవనం కోసం అక్టోబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర పిలుపునిచ్చారు. ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహాధర్నాకు జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ సమాజం పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల్లో రక్షణ కల్పించేలా తగిన చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెం.3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఆదివాసీల భూముల అక్రమ బదలాయింపులు, ఆక్రమణలను అరికట్టి వారి భూములకు సంపూర్ణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలి

- **నిరుద్యోగం, విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు Gen Z పోరాటం స్ఫూర్తిదాయకం**
- **ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెన్ జడ్ ఉద్యమంపై అవగాహన సదస్సు**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 30 (డీ డీ 9 వార్త):

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన ఉద్యమం స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు ఆ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని తమ హక్కుల కోసం ప్రశ్నించే తత్వాన్ని, పోరాడే స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.
భద్రాచలంలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జన్ జడ్ ఉద్యమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షత వహించగా, మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్, మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాల డైరెక్టర్ తోటమల్ల రమణ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, తమ హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించే ధైర్యాన్ని కలిగి ఉండాలని అన్నారు.
ఫీజు, ఉపాధి, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు వంటి సమస్యల పరిష్కారానికి విద్యార్థులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి ఉద్యమాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని, చరిత్రలో అనేక సందర్భాల్లో విద్యార్థులు ప్రజా సమస్యలపై ముందుండి పోరాడారని గుర్తుచేశారు. ప్రస్తుత జెంజి జడ్ తరం సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తోందని, అయితే అంతర్జాల వేదికలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించి ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ గొంతును వినిపించాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను నిర్ధారించుకోవాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని సూచించారు.
విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మి, నికిత, పద్మ, అంజలి, రాణి, లక్ష్మీ ప్రసన్న, సాహుల్, ప్రశాంత్, కిషోర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి చిన్నదే.. వైద్యసేవలు ఘనమే..!

- కాటాపురం పీహెచ్‌సీలో ప్రజలకు చేరువైన వైద్యసేవలు
- డాక్టర్ రంజిత్ సేవలకు పేషెంట్ల నుంచి ప్రశంసలు.. అధికారుల అభినందనలు
- రోజుకు 50 నుంచి 150 మంది వరకు.
- ఒక్కో రోజు 250 మందికి పైగా వైద్యం
- పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్యం

ఏటూరునాగారం,క్రైం,,
డి డి డి 9 వార్త,సెప్టెంబర్ 30

ములుగు జిల్లాలోని కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఉంటే పేషెంట్లు రాకపోవడం పేషెంట్లు వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నా కాటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రం అందుకు భిన్నంగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది.ఆసుపత్రి చిన్నదే అయినా అక్కడ అందుతున్న వైద్యసేవలు మాత్రం పెద్ద స్థాయిలో ఉన్నాయంటూ పరిసర గ్రామాల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

పెట్టకొంచె కూత ఘనం..
కాటాపురం పీహెచ్‌సీ పనితనం ఘనం..!!

కాటాపురం పీహెచ్‌సీ పరిధిలోని సుమారు 8 గ్రామపంచాయతీలతో పాటు వాటి పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వైద్యం కోసం ఆసుపత్రికి వస్తున్నారు.జ్వరాలు, జలుబు, వైరల్ ఫీవర్,డెంగ్యూ, మలేరియా వంటి అనారోగ్య సమస్యలతో పాటు గర్భిణీ మహిళలు కూడా వైద్యసేవలు పొందుతున్నారు.ప్రతిరోజూ సగటున 50 నుంచి 150 మంది వరకు పేషెంట్లు వస్తుండగా కొన్ని రోజుల్లో ఈ సంఖ్య 250 మందికి పైగా చేరుతున్నట్లు తెలుస్తోంది.

సమయం దాటినా సేవలకు వెనుకడుగు లేదు.

సాధారణంగా పీహెచ్‌సీల పనివేళలు పరిమితంగా ఉన్నప్పటికీ డాక్టర్ రంజిత్ మాత్రం సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటూ పేషెంట్లకు వైద్యం అందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.ఉదయం నుంచి వచ్చే పేషెంట్లను ఓపికగా పరీక్షిస్తూ అవసరమైన వైద్యసేవలు అందించడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.తాగునీరు, భోజనం,ఇతర వ్యక్తిగత అవసరాల కోసం కూడా పేషెంట్లను ఇబ్బందులకు గురిచేయకుండా వైద్యసేవలకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న వైద్యుడిగా ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా పేషెంట్ల సమస్యలను శ్రద్ధగా వినడం డాక్టర్ రంజిత్ పనితీరులో ప్రత్యేకతగా ఉందని స్థానికులు అంటున్నారు.

పచ్చని చెట్ల మధ్య..
ప్రశాంత వాతావరణంలో వైద్యం

కాటాపురం పీహెచ్‌సీ ఆవరణలో పచ్చని చెట్లు ఉండటంతో వైద్యం కోసం వచ్చే పేషెంట్లు విశ్రాంతి తీసుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.చల్లటి గాలి, ప్రశాంతమైన వాతావరణం పేషెంట్లకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోందని స్థానికులు చెబుతున్నారు.

ప్రజల మన్ననలు.. అధికారుల ప్రశంసలు

కాటాపురం పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై పరిసర ప్రాంతాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఆసుపత్రి అయినప్పటికీ ప్రజలకు వైద్యం అందించడంలో చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.ప్రభుత్వ వైద్యసేవలు గ్రామీణ ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూర్చాలంటే కాటాపురం పీహెచ్‌సీ తరహాలో వైద్యులు అందుబాటులో ఉండి సేవ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆసుపత్రి ఎంత హల్లాదమో..
వైద్యసేవలు అంత ఘనమో..!

వైద్యుడు అందుబాటులో ఉంటేనే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది.ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా కాటాపురం పీహెచ్‌సీలో వైద్యసేవలు అందుతున్నాయంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి చిన్నదైనా పేషెంట్ల సంఖ్య పెరుగుతున్నా వైద్యసేవల్లో మాత్రం వెనుకడుగు వేయకుండా ముందుకు సాగుతున్న కాటాపురం పీహెచ్‌సీ పనితీరు గ్రామీణ ప్రభుత్వ వైద్యవ్యవస్థకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోందని ప్రజలు అంటున్నారు.






ఆదివాసీలకు ఆశాకిరణం.. ఐటీడీఏ..!

- అభివృద్ధి ఫలాలను గిరిజన గడపకు చేర్చుతూ.. సమస్యలకు పరిష్కారం చూపుతూ..
- ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల.. విద్యార్థులకు ఆరోగ్యం–పరిశుభ్రత–పౌష్టికాహారం
- పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం.. అధికారుల పర్యవేక్షణతో మారుతున్న పాఠశాలల రూపురేఖలు

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 30

ఆదివాసీ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అండగా నిలుస్తూ ఐటీడీఏ ముందడుగు వేస్తోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చాలాకాలంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ పాఠశాలల రూపురేఖలను మార్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

శిథిలాల నుంచి సౌకర్యాల వైపు....

ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులు ,ప్రహరీగోడల పునరుద్ధరణ,భవనాల పైకప్పుల మరమ్మతులు,విద్యార్థుల భద్రతకు అవసరమైన పనులు చేపడుతున్నారు.కొన్ని చోట్ల ప్రహరీగోడలకు ముళ్లకంచె ఏర్పాటు చేసి కోతుల బెడదను కూడా తగ్గించే చర్యలు చేపట్టారు.పాఠశాలల ఆవరణల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో రాత్రివేళల్లో భద్రత, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతున్నాయి.ఎన్నో ఏళ్లుగా చిన్నచిన్న సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఈ పనులతో కొంత ఊరట లభిస్తోంది.మౌలిక వసతులు మెరుగుపడటంతో పాఠశాలల్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతోందని తెలుస్తోంది.

పచ్చని చెట్లు.. పరిశుభ్రత.. పౌష్టికాహారం..

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.మొక్కలు నాటడం, పచ్చదనం పెంచడం,స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు.విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు, రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో వారు ఆరోగ్యంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారు. చదువుతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత,క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తాడ్వాయి ఆశ్రమ పాఠశాల..
యూనివర్సిటీని తలపించేలా..

తాడ్వాయిలోని ఆశ్రమ పాఠశాల ఆవరణ పచ్చదనం,విస్తీర్ణం, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. భారీ సంఖ్యలో విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచేందుకు నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.హెడ్‌మాస్టర్ ప్రోత్సాహం,హెచ్‌డబ్ల్యూఓ పట్టుదల, ఉపాధ్యాయుల అంకితభావం కలగలిసి పాఠశాల నిర్వహణలో మార్పులు తీసుకొస్తున్నాయి.పెరిగిన బాధ్యతతో విద్యార్థుల చదువుపై మరింత శ్రద్ధ పెట్టేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

చదువులోనే కాదు.. క్రీడల్లోనూ సత్తా..

విద్యార్థులకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. హెచ్‌డబ్ల్యూఓల పర్యవేక్షణతో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.దీంతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో చదువులో రాణించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధిస్తూ గిరిజన విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు తెస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణతో.. మరింత మెరుగైన ఫలితాలు

ప్రాజెక్టు అధికారి పటిష్టమైన చర్యలు చేపడుతుండగా డీడీ,ఏటీడీఓతో పాటు ఇతర అధికారులు ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తూ పరిస్థితులను పరిశీలిస్తున్నారు. విద్యాబోధన,విద్యార్థుల వసతులు, ఆరోగ్యం,పరిశుభ్రత,భోజన నాణ్యతవంటి అంశాలపై పర్యవేక్షణ చేస్తూ నిర్వాహకులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. విద్యా వాతావరణం అందే అవకాశం ఉంది. మౌలిక వసతులు మెరుగైతే.. విద్యాబోధనకు బలం..ఆరోగ్యం బాగుంటే.. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా..ఐటీడీఏ అడుగులు.. ఆదివాసీ విద్యార్థులకు ఆశాకిరణాలు..!





కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీల ఏర్పాటు..

- పార్టీ బలోపేతానికి చిట్యాల సాగర్ పిలుపు..

సెప్టెంబర్ 30: డిడి9 వార్త వెంకటాపురం.

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేసే దిశగా గ్రామ కమిటీల నియామకాలు చేపట్టారు. మండలంలోని ఎదిరా, సురవీడు, కొండాపురం, ఆలుబాక తదితర గ్రామపంచాయతీల్లో గ్రామ కమిటీల ఏర్పాటు కార్యక్రమాన్ని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిట్యాల సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎల్. వెంకట నరసయ్య ఆదేశాల మేరకు, ములుగు జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మట్టేవాడ తిరుపతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎదిరా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జాడి నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సునారికాని ధనరాజ్, కార్యదర్శులుగా చప్పిడి రాంబాబు, కొండగొర్ల సునీతలను నియమించారు. ఈ సందర్భంగా చిట్యాల సాగర్ మాట్లాడుతూ, నూతనంగా నియమితులైన గ్రామ కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మొత్తం 26 మందితో కూడిన ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సునార్కాని రమేష్, గోగు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి జాడి బిక్షపతి, మండల కార్యదర్శులు సునార్కాని రాజు, జాడి రాము తదితరులు పాల్గొన్నారు.



శ్రీ దేవి శరన్నవరాత్రులు–బతుకమ్మ ఉత్సవాలకు కమిటీ ఏర్పాటు



- భక్తిశ్రద్ధలతో ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు.. అధ్యక్షుడిగా బత్తిని రమేష్

గుండాల, సెప్టెంబర్ 30 (డిడి9వార్త):

శ్రీ దేవి శరన్నవరాత్రులు-బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు.

ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా బత్తిని రమేష్, కార్యదర్శిగా జవ్వాజి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా గుండెబోయిన లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. సహాయ కార్యదర్శిగా బొబ్బిలి శ్రవణ్, కోశాధికారిగా మాచర్ల రంజిత్ బాధ్యతలు చేపట్టనున్నారు.

కమిటీ సభ్యులుగా మాచర్ల రాకేష్, గడ్డం శ్రీకాంత్, వాసం శివ, పిల్లి కృష్ణ, గడ్డం సాయి, యాసారపు సురేష్, పల్లెర్ల రవివర్మ, మాచర్ల వంశీ, వల్లోజీ సాగర్, యాసారపు యాకయ్య, తవుడోజు సురేష్లను నియమించారు.

శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవాల సందర్భంగా భక్తుల రాకపోకలు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఉత్సవ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా కమిటీ సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

ఆరోగ్యకరమైన కుటుంబానికి పోషకాహారం ఎంతో కీలకం

- గర్భిణీలు,బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- పత్తిపాక సెక్టార్ సూపర్‌వైజర్ సునిత

శాయంపేట, సెప్టెంబర్ 30, డి డి 9వార్త

ఆరోగ్యకరమైన కుటుంబానికి పోషకాహారం ఎంతో కీలకమని పత్తిపాక సెక్టార్ సూపర్‌వైజర్ సునిత అన్నారు.హన్మకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో బుధవారం సెక్టార్ లెవెల్ పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు,అంగన్వాడీ సిబ్బంది,ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మామిడి అశోక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఉప సర్పంచ్ అలవాల భాస్కర్,వార్డు సభ్యులు శానబోయిన మల్లేష్‌తో పాటు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొని పోషణ మాస కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా పత్తిపాక సెక్టార్ సూపర్‌వైజర్ సునిత మాట్లాడుతూ ఆరోగ్యకరమైన కుటుంబానికి పోషకాహారం ఎంతో కీలకమని అన్నారు.ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంతో పాటు శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శరీరానికి అవసరమైన పోషకాలు,విటమిన్లు, ఐరన్ అందేలా సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు.గ్రామాల్లోనే సులభంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు,పప్పుధాన్యాలు తదితర ఆహార పదార్థాల్లో అనేక పోషక విలువలు ఉంటాయని వివరించారు. ఖరీదైన ఆహార పదార్థాల కంటే స్థానికంగా లభించే తాజా కూరగాయలు,ఆకుకూరలు, పండ్లు, పప్పులు ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలను పొందవచ్చని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ గుడ్డు తీసుకోవడంతో పాటు పాలు తాగాలని,ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని ఆకుకూరలు,కూరగాయలు, పండ్లను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.చిన్నారులకు కూడా వయస్సుకు తగిన విధంగా పోషకాహారం అందిస్తూ వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోషకాహార లోపం కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై కుటుంబాల్లో అవగాహన పెంచాలని, ప్రతి ఇంటిలో పోషకాహార ప్రాధాన్యతను వివరించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అందించడం ప్రతి కుటుంబం బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు,అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూలు, ఆకుకూరల సాగుతో అధిక ఆదాయం

డిడి9 వార్త గుడిహత్నూర్:

పూలు, కూరగాయలు, ఆకుకూరల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ విస్తరణ అధికారి ఆడెపు శేఖర్ సూచించారు. బుధవారం గుడిహత్నూర్ మండలంలోని తోషం, మాన్కాపూర్ గ్రామాల్లో పర్యటించి కూరగాయలు, బంతిపూల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలినో ప్రభావం దృష్ట్యా రైతులు పంటల వైవిధ్యాన్ని పాటించాలని సూచించారు. బంతిపూలతో పాటు కూరగాయలు, కొత్తిమీర, మెంతి వంటి ఆకుకూరలను సాగు చేయడం ద్వారా స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, పురుగులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుశీల్, రైతు బడే ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.





శ్రీ సార్వజనిక్ దుర్గా ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):


బోధన్ పట్టణంలో నిర్వహించే శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల కోసం శ్రీ సార్వజనిక్ దుర్గా ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ చక్రేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పుర ప్రముఖులు, భక్తులు పాల్గొని నూతన బాధ్యతలను ఖరారు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా గంభీరావుపేట శ్రీనివాస్, కార్యదర్శిగా ఆలూరు గంగాధర్, కోశాధికారిగా హరికాంత్ చారీ ఎన్నికయ్యారు. దేవీ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పురప్రముఖుల సహకారంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

108 ప్రోగ్రాం మేనేజర్‌కు ఆత్మీయ వీడ్కోలు

- **నూతన అధికారికి స్వాగతం**

నిజామాబాద్ జిల్లా ,
సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

ఉమ్మడి నిజామాబాద్‌నిర్మల్ జిల్లాల 108 అత్యవసర సేవల ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా, ఆయనకు బుధవారం 108 ఉద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇదే సమయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రోగ్రాం మేనేజర్ సంపత్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. జనార్దన్ సారథ్యంలో గడిచిన నెలలో నిజామాబాద్ జిల్లా 108 సేవల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, నూతన అధికారి సంపత్‌కు అభినందనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాల కోఆర్డినేటర్లు స్వరాజ్, తిరుపతి, సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుంకరి విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యా సేవలకు వీడ్కోలు..

- **సచిన్ దేశ్‌ముఖ్‌కు ఘన సన్మానం**

ఆదిలాబాద్ జిల్లా:సోనాల మండలం: సెప్టెంబర్ 30 (డిడి 9 వార్త న్యూస్):


పి.ఎం.శ్రీ జెడ్పీహెచ్ఎస్ సోనాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్ దేశ్‌ముఖ్ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్వో మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గాజుల లక్ష్మీ, జిల్లా పి.ఆర్.టి.యు అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్, కార్యదర్శి సురుకుంటి వినోద్ రెడ్డి హాజరయ్యారు. వివిధ మండలాల పి.ఆర్.టి.యు, ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పి.ఎం.శ్రీ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆలపించిన పాటలు, ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడిగా సచిన్ దేశ్‌ముఖ్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేశారు. నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ విద్యార్థుల పట్ల ఆప్యాయత చూపారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులతో సమస్వయం చేసుకుంటూ పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఆయన సేవలు అభినందనీయమని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని, ఆ బాధ్యతను సచిన్ దేశ్‌ముఖ్ సమర్థవంతంగా నిర్వర్తించారని వక్తలు పేర్కొన్నారు. ఆయన సేవలు పాఠశాల కుటుంబానికి చిరస్మరణీయంగా నిలుస్తాయని అన్నారు. అనంతరం సచిన్ దేశ్‌ముఖ్‌ను శాలువా, పూలమాల,జ్ఞాపికతోఘనంగాసన్మానించారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.



శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన నిబంధనలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

నిజామాద్ కమీషనరేటు పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సౌకర్యార్థం అక్టోబర్ 01 నుంచి 15వ తేదీ వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ భవనాల్లో విగ్రహాలను ప్రతిష్టించరాదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డిజేలకు పూర్తిగా నిషేధం విధించామని, అనుమతి పొందిన సౌండ్ సిస్టమ్‌లు కూడా 55 డెసిబెల్స్ మించకూడదని పేర్కొన్నారు. అలాగే 500 మంది వరకు పాల్గొనే సమావేశాలకు ఏసీపీ అనుమతి, అంతకంటే ఎక్కువ జనాలు ఉండే కార్యక్రమాలకు 72 గంటల ముందుగానే సీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. డ్రోన్ల వినియోగానికి సంబంధిత ప్రభుత్వ, ఏవియేషన్ క్లియరెన్స్ తప్పనిసరి అని వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధం అమలులో ఉంటుందని, 'ఎ' సర్టిఫికెట్ ఉన్న సినిమాలకు మైనర్లను అనుమతిస్తే థియేటర్ల యాజమాన్యాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎస్‌హెచ్ఓలు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఈ సందర్భంగా సీపీ తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు..!

- **రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి**
- **భూముల హద్దులు స్పష్టంగా గుర్తించాలి**
- **హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి**

శాయంపేట, సెప్టెంబర్ 30, డి డి 9వార్త

ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.రవి స్పష్టం చేశారు. బుధవారం శాయంపేట మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే పురోగతిపై స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో రీ సర్వే ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పరిధిలోని భూములను సమగ్రంగా పరిశీలించి,ఎక్కడెక్కడ ఏ రకమైన భూములు ఉన్నాయో గుర్తించాలని సూచించారు.ప్రభుత్వ,పట్టా,అసైన్డ్ తదితర భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేసి ,ఆయా భూములకు సంబంధించిన హద్దులను ఖచ్చితంగా నిర్ణయించాలని తెలిపారు.

ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి..

ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని అడిషనల్ కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో తనిఖీ...

అనంతరం మండలంలోని గోవిందాపూర్ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్‌ను అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి సందర్శించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం,ఇతర వసతులు అందుతున్నాయా లేదా అనే విషయాలను ఎస్‌వో మాధవిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లోని వంటగది,మరుగుదొడ్లను పరిశీలించిన ఆయన విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం,పరిశుభ్రమైన వాతావరణం,అవసరమైన మౌలిక వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న,స్థానిక తహసిల్దార్ ప్రవీణ్ కుమార్,ఆర్ఐ చిమన్ నాయక్, సర్వేయర్లు,పలు గ్రామాల జీపీఓలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







నెట్‌బాల్‌లో కోనసముందర్ విద్యార్థుల సత్తా.. రాష్ట్రస్థాయికి ఆరుగురు

- **జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర పోటీలకు ఎంపిక**

నిజామాబాద్, సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన విద్యార్థులు నెట్‌బాల్ క్రీడలో సత్తా చాటారు. నిజామాబాద్ జిల్లా తీర్మాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. అండర్-16 బాలుర విభాగంలో ఎం. శివగౌడ్, బాలికల విభాగంలో జి. రాజవర్ధిని, ఎన్. నికిత, అండర్-19 బాలుర విభాగంలో ఎన్. పవన్, బాలికల విభాగంలో బి. వెన్నెల, బి. సంజన రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. ఎంపికైన అండర్-16 క్రీడాకారులు అక్టోబర్ 10, 11, 12 తేదీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ బి. రమేష్‌గౌడ్ తెలిపారు. అండర్-19 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాటు పీడీ బి. రమేష్‌గౌడ్‌ను గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




రోగ్యకర సమాజ నిర్మాణంలో అంగన్వాడీల పాత్ర కీలకం: సీడీపీఓ నందిని

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాలను నివారించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని బోధన్ సీడీపీఓ నందిని పేర్కొన్నారు. బుధవారం బోధన్ పట్టణం రాకాసిపేట్ సెక్టార్ స్థాయిలో నిర్వహించిన 9వ పోషణ మాస కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ.. హమారీ అంగన్వాడీ హమారీ జిమ్మేదారీ అనే సంకల్పంతో ప్రతి అంగన్వాడీ కేంద్రం బాధ్యతాయుతంగా సేవలు అందిస్తోందన్నారు. గర్భధారణ సమయం నుంచి పిల్లల పెరుగుదల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అనుబంధ పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారం లోపిస్తే పిల్లల్లో తక్కువ బరువు, ఎదుగుదల లోపాలు, రక్తహీనత వంటి సమస్యలు వస్తాయని, ఆకుకూరలు, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా వీటిని అరికట్టవచ్చని స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా చిన్న పిల్లలకు అన్నప్రాసనలు చేయించగా, గర్భిణులకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాలు నిర్వహించి పండ్లు, కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ రేణుక, సెక్టార్ సూపర్‌వైజర్ సరోజిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆసియా బేగం, ఎస్ఎస్ఎఫ్‌పీ కోఆర్డినేటర్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ అర్జున్లతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

కామారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు బుధవారం సందర్శించారు. కళాశాలలో రూ.10.30 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరావు తాగునీరు, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మాణం, ల్యాబ్‌ల కొరత తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధ్యాపకులను, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ పార్టీ సోనాల మండల ఉపాధ్యక్షులు షేక్ మహిమూద్ కు ఘనసన్మానం..

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 30: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సీనియర్ మైనార్టీ నాయకులు షేక్ మహిమూద్ ఘనసన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల పోతున్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జుంగల భోజన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్ రావు, పట్టణ అధ్యక్షులు కసిరే. పోతన్న, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మునేశ్వర్ చంద్రకాంత్, రామచందర్, లాలూ రామ్, జాకు, కడారి శ్రీనివాస్, మాజీ సర్పంచులు రాందాస్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గైనకాలజిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

బోధన్ జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న రెండు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తు పత్రాలను బోధన్ జిల్లా ఆసుపత్రిలో గానీ లేదా నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని డిసిహెచ్ఎస్ కార్యాలయంలో గానీ నేరుగా అందజేయవచ్చు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆర్థిక వికాసం

- **ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి**
- **-లక్కంపల్లి సెజ్‌లో ఆయిల్ పామ్ పరిశ్రమ స్థల పరిశీలన**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే స్థానిక రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ సమీపంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనువైన స్థలాలను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఇతర అధికారులతో కలిసి ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటికే 17 వేల ఎకరాల పైచిలుకు ఆయిల్ పామ్ సాగులో ఉందని, పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాకు కూడా ఈ ప్రాంతం సమీపంలో ఉండటంతో ఫ్యాక్టరీ ఏర్పాటు అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. స్థల నిర్ధారణ పూర్తి కాగానే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని చెప్పారు. అధిక లాభాలు ఇచ్చే ఆయిల్ పామ్ సాగుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో రైస్ బ్రాన్ ఆయిల్, సోయా పరిశ్రమల ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని వెల్లడించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున యాసంగిలో వరి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఆర్ఓబీ నిధుల విడుదలపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి హర్షం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

నిజామాబాద్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సుదీర్ఘ రైల్వే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.14.77 కోట్ల నిధులను విడుదల చేయడం పట్ల బుధవారం ఒక ప్రకటనలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి చేసిన నిరంతర ప్రయత్నాల వల్లే అర్సపల్లి, బైపాస్ రోడ్డు మరియు మాధవ్‌నగర్ ఆర్ఓబీల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులతో వంతెనల నిర్మాణంతో పాటు నాలుగు వరుసల రహదారుల అభివృద్ధి వేగవంతమై రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుంటే, ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేయడం విచారకరమని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రప్పించడంలో చిత్తశుద్ధి ఉంటే బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సవాల్ విసిరారు. విమర్శల కంటే ప్రజలకు ఉపయోగపడే సంక్షేమం, అభివృద్ధి పనులే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.





అర్సపల్లి ఆర్ఓబీ నిధులన్నీ కేంద్రానివే : ఎంపీ అర్వింద్

- **ఎమ్మెల్యే భూపతిరెడ్డి వ్యాఖ్యలపై ఎంపీ తీవ్ర ఆగ్రహం**
- **మాధవ్ నగర్ ఆర్ఓబీ అదనపు నిధులకు అనుమతులివ్వాలని డిమాండ్**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

నిజామాబాద్లోని అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి వంద శాతం నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రజల చెవుల్లో పువ్వు పెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. బుధవారం నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి, కేంద్రానికి సమర్పించిన 48 నుంచి 72 గంటల్లోనే నిధులు రీయింబర్స్ అవుతాయని వివరించారు. నిన్న విడుదలైన రూ.14.77 కోట్ల బిల్లులో రూ.13.65 కోట్లు కేంద్ర నిధులేనని తేల్చి చెప్పారు. ఈ బిల్లుల విడుదల కోసం తానే స్వయంగా రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను పలుమార్లు కోరినట్లు వెల్లడించారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మాధవ్ నగర్ ఆర్ఓబీ అదనపు నిధులకు పరిపాలనా అనుమతులు ఎవరు ఇప్పించాలని ప్రశ్నించారు. అనుమతులు ఇవ్వకపోతే రెండో వైపు పనులు ముందుకు సాగవన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తీసుకురావాలో తమకు తెలుసని, తమకు ఎవరి సలహాలూ అవసరం లేదని వ్యాఖ్యానించారు. మాధవ్ నగర్ ఆర్ఓబీకి తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



తెలంగాణ రక్షణ సేన పార్టీలో యువకుల చేరిక


ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో): సెప్టెంబర్ 30: (డిడి 9 వార్త న్యూస్):

నేరడిగొండ మండలానికి చెందిన స్థానికులు, గుత్పల గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. *పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాథోడ్ బాపూరావు మంచితనం, ప్రజల కోసం గతంలో చేసిన సేవా కార్యక్రమాలను చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు.

మైనారిటీ చైర్మన్ అయూబ్ బేగ్, మండల కన్వీనర్ బానోత్ వసంత్ రావు* ఆధ్వర్యంలో యువకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో షేక్ కబీర్, షేక్ పరమేజ్, ఖాదీర్ పాషా, షేక్ ఆవేశ్, అయూబ్ బేగ్, షేక్ మాస్రూఫ్, షేక్ హిరన్, ఫిరోజ్, షేక్ నావజ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి యువత ముందుకు రావడం సంతోషకరమని నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది యువకులు పార్టీలో చేరుతారని వారు పేర్కొన్నారు.



పార్డీ బి లో పి ఆర్ ఎ గ్రామసభ

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 30: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు సోనాల మండలంలోని పార్టీ గ్రామపంచాయతీలో పి ఆర్ ఏ గ్రామసభ మరియు విబిజి రామ్ జి పనులు మ్యాప్ ద్వారా సర్పంచ్ మరియు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్ వారికి స్థానిక సోనాల మండల ఎంపీడీవో వివరించడం జరిగింది. దానిలో భాగంగా అక్టోబర్ 2 న కచ్చితంగా ప్రతి గ్రామపంచాయతీలో ఇలాంటి మాడల్ మ్యాప్ తయారుచేసి మనం ఎలాంటి పనులు ఏ విధంగా చేయాలి అత్యవసర పనులు గుర్తించి గ్రామసభ ద్వారా మండలానికి పంపితే మండలంలోని జిల్లాకు పంపించడం జరుగుతుంది అని వివరించారు ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు



జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాలను నమోదు చేయాలి: ఎన్పీఆర్డీ

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

రాబోయే జనాభా లెక్కల సేకరణలో 2016 హక్కుల చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలను కలిగిన వికలాంగుల సమాచారాన్ని నమోదు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్పీఆర్డీ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వం వికలాంగుల వాస్తవ జనాభాను తగ్గించేలా కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కులాలు, మతాల లెక్కలకు ఇచ్చే ప్రాధాన్యం వికలాంగుల వివరాల సేకరణకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. 2016ఆర్పీడీ చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలు ఉంటే, కేవలం 9 రకాలనే ప్రామాణికంగా తీసుకోవడం అన్యాయమన్నారు. ఆటిజం, మరుగుజ్జుతనం, కుష్టు వ్యాధి నయమైన వారు, బహుళ వైకల్యాలు ఉన్న వారిని లెక్కించకపోవడం వికలాంగులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు గైని రాములు మాట్లాడుతూ సమగ్ర వివరాలు సేకరించకపోతే వికలాంగులు సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి అవకాశాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్ పటేల్, వెంకటేష్, నజీర్, చింటూ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

నిజామాబాద్ నగరంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి జీవీఎన్ భారత లక్ష్మీ బుధవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్మల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... బూరుడుగల్లీకి చెందిన జంబిలం దిలీప్ మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులను వేధించేవాడు. దీనిపై పక్కింటి మహిళ రేషం లక్ష్మీ మందలించగా కక్ష పెంచుకున్న దిలీప్ 2024 డిసెంబర్ 9న ఆమెపై తీవ్ర దాడికి పాల్పడి గొంతు పిసికి, ఛాతిపై కూర్చుని హత్యాయత్నానికి ఒడిగట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసి సేకరించిన పక్కా సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో కోర్టు నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో స్వంత కుమారుడిని బ్లేడుతో కోసిన కేసుతో సహా మరిన్ని క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రాసిక్యూషన్ తెలిపింది. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అధికారులు, పోలీసు సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు.







యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **చెడు వ్యసనాలకు స్నేహాలకు దూరంగా ఉండాలి**
- **యువత బతుకు విలువ తెలుసుకో**
- **బంగారు భవిష్యత్తును నిర్మించుకో**
- **జల్సాలు వద్దు.. అమ్మానాన్నల మాటలే ముద్దు**
- **డ్రగ్స్ రహిత -డ్రగ్స్ నివారణకు యువత కృషి చేయాలి**
- **చదువుతో సమాజంలో గుర్తింపు**
- **బోథ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ డి గురుస్వామి**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 30:(డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలంలోని దన్నూర్ బి గ్రామంలో గల హరిజనవాడలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని బోథ్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ డి గురుస్వామి మాట్లాడుతూ

యువత చెడు వ్యసనాలు స్నేహాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే కష్టపడి పని చేసుకోవాలని, అమ్మానాన్నల మాటలను తూచా తప్పకుండా పాటిస్తూ, మంచి మార్గంలో నడవాలని సూచించారు. అంతేకాకుండా ఎటువంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంత జీవనాన్ని గడుపుతూ ఐకమత్యంతో కలిసి ఉంటూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలిపారు. డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుటలో యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. జల్సా లకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్, ఎల్మారోహిణి వినయ్ రెడ్డి, ఉప సర్పంచ్, కారం సుజాత, బత్తిని గంగయ్య, పోలీస్ సిబ్బంది కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

- **సోనాల తహసిల్దార్ మల్లేష్...**

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 30: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండలంలోని పార్డి (కే) గ్రామ పంచాయతీలో పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోనాల తహసిల్దార్ మల్లేష్ మాట్లాడుతూ ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సమానత్వం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.

సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో చట్టాలపై సరైన అవగాహన లేక తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, తప్పుడు మార్గంలో వెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సోనాల తహసిల్దార్ మల్లేష్, సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు కాంలే .భీంరావు, ఉప సర్పంచ్ అశోక్, సీనియర్ అసిస్టెంట్ మురళి, గ్రామపంచాయతీ కార్యదర్శి, అమనిక, టెక్నికల్ అసిస్టెంట్, సురేష్, జూనియర్ అసిస్టెంట్ జీవన్, జిపిఓ అనుజ్ఞ, వార్ సభ్యులు నగేష్, జైతు, ప్రజలు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఏఎస్ఐ లక్ష్మణ్‌కు ఘనంగా వీడ్కోలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి బుధవారం పదవీ విరమణ పొందిన ఈ.లక్ష్మణ్‌కు జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. సుదీర్ఘంగా 36 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో అందించిన సేవలకు గాను ఆయనను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్నప్పటికీ ఎలాంటి రిమార్కులు లేకుండా ప్రశాంతంగా పదవీ విరమణ చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. లక్ష్మణ్ అందించిన సేవలు గుర్తించదగినవని, పదవీ విరమణ అనంతరం ఆయనకు, ఆయన కుటుంబానికి ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లక్ష్మణ్ కుటుంబసభ్యులు ఆయురారోగ్యాలతో, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ ఏషియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, జగతి, వనమాల, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ధరణి కుమార్, శేఖర్ బాబు, లక్ష్మణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





చింతకుంట నవనాథ్ సిద్ధేశ్వర ఆలయానికి ప్రభుత్వ గుర్తింపు నివ్వాలి

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

మోస్రా మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో వెలసిన శతాబ్దాల నాటి ప్రాచీన శ్రీ నవనాథ్ సిద్ధేశ్వర ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దాదాపు 100 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో శ్రీకృష్ణుడు, విరలేశ్వరుడు భక్తులకు అభయమిస్తున్నారు. ఆలయం వెనుక భాగంలో 5 అడుగుల లోతు, 3 అడుగుల వెడల్పుతో నిరంతరం నీటితో కళకళలాడే ప్రత్యేక కోనేరు ఉండటం ఇక్కడి విశిష్టత అని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో ఐదు రోజుల పాటు శ్రావణ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.ప్రతి అమావాస్యకు అన్నదాన కార్యక్రమంతో పాటు రోజువారీ నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయని కమిటీ ప్రతినిధులు వివరించారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ చారిత్రక ఆలయానికి రక్షణ కల్పించి, ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందించేలా దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్మింగలి లింగయ్య, ప్రధాన కార్యదర్శి అక్కమ్మొల్ల సాయిలు, కోశాధికారి అంబాయి గారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు కోరారు.

వయోవృద్ధులు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వయోవృద్ధులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించినట్లు బోధన్ డివిజన్ వయోవృద్ధుల సంక్షేమ ఫోరం ప్రతినిధులు తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 1 వరకు వారోత్సవాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్లు, ఉపాధ్యాయులను సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విజయకుమారి, డిటీఓ నాగేశ్, పట్టణ సీఐ వెంకటనారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రాజేశ్వర్, సత్యనారాయణ, విఠల్ రావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



అదనపు బస్సుల కోసం ఖాజాపూర్‌లో విద్యార్థుల ఆందోళన

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

సాలూర మండలం ఖాజాపూర్ వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. సుంకిని నుంచి సాలూర మీదుగా బోధన్ తదితర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు సరిపడా బస్సులు లేక నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయాల్లో తీవ్ర రద్దీతో ప్రయాణించాల్సి వస్తోందని, కొన్ని సార్లు బస్సులు దొరకక సమయం వృథా అవుతోందని వాపోయారు. విద్యార్థుల ఆందోళన సమాచారంతో బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ వెంటనే అక్కడికి చేరుకుని సమస్యను పరిశీలించారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి ఉదయం, సాయంత్రం విద్యార్థుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడిపేలా చూస్తామని ఎస్సై స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎస్సై హామీతో విద్యార్థులు ధర్నా విరమించి వెళ్లిపోయారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి అదనపు బస్సులు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 30 (డీడీ9 వార్త):

ప్రతి పౌరుడు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శంకర్ లు తెలిపారు. సాలూర మండలం సాలూర క్యాంప్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చైతన్య సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల రక్షణకు ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకవచ్చిందని, వాటిని సరైన మార్గంలో ఉపయోగించుకున్నప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి వివక్షకు తావులేకుండా సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రాముఖ్యత, పౌర హక్కుల పరిరక్షణ, బాధితులకు అందే న్యాయ సహాయంపై స్థానిక ప్రజలకు సమగ్ర సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొండేటి విజయ్ భాస్కర్ రెడ్డి, ఎస్సీ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కోవడాన్ని ఖండిస్తున్నాం

- **వ్యక్తిగత దూషణలను చేయడం సరి కాదు**
- **కనుచూపుమేరా, కనిపించని ఇంటిగ్రేటెడ్ పాఠశాల.**
- **ప్రతిపక్షంలో ఉన్నా మేము తప్పులను ఎత్తిచూపకూడదా?**
- **అభివృద్ధిలో పోటీ పడండి, అధికారంలో ఉన్నది మీరేగా.**
- **మండల బీఆర్ఎస్ నాయకుల విలేకరుల సమావేశం,**

యాలాల సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):




నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఇంతవరకు ప్రారంభం కూడా కాకపోవడం శోషనీయమని మండల బీఆర్ఎస్ నాయకులు అరవింద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, లక్ష్మప్ప, లాలూ ముదిరాజ్, మెట్రి కృష్ణ, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం యాలాల మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎంతో ఆర్భాటంగా అంచనా విలువ రూ.200. కోట్లతో శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇంతవరకు ప్రారంభించకపోవడం ఏమిటన్నారు. కనీసం ఒక రాయి కూడా పాఠశాల నిర్మాణానికి వేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్న కాంగ్రెస్ నాయకుల మాటలు చేతలలో లేకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు.వ్యక్తిగత దూషణలు చేస్తూ ప్రతిపక్ష నాయకుల మనోభావాలను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల పేరుతో అక్రమ మట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఇన్ని నెలలు గడిచిన కనీసం పాఠశాల ప్రారంభానికి ఒక ఇటుక కూడా పెట్టలేదన్నారు. అభివృద్ధి అభివృద్ధి అని చెప్పుకునే కాంగ్రెస్, చేతలలో అభివృద్ధి చేయకుండా సమయాన్ని వృధా చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అక్రమ ఇసుక, మట్టి వ్యాపారాలతో కాంగ్రెస్ లో కొంతమంది నాయకులు తల మునకలై మండల అభివృద్ధికి తిలోదకాలు ఇచ్చారన్నారు. బెన్నూరు గ్రామ ప్రాంతంలోని పొలాలు కాలుష్యం కోరల్లో చిక్కి కంపెనీ వెదజల్లే దుర్గందాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలు తాగే కాగ్నా నీటిని కంపెనీ కాలుష్య వ్యర్థాలు కలుషితం చేస్తూ ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు తాము చేస్తున్న కార్యకలాపాలను మానుకొని మండల అభివృద్ధిపై తమ దృష్టిసారించాలన్నారు. మండల అభివృద్ధికి తాము ఎప్పుడు వ్యతిరేకం కాదన్నారు. మండల అభివృద్ధిని మరిచి వ్యక్తిగత అభివృద్ధి కోసం పాకులాడే నాయకుల వ్యవహార శైలి పట్ల తాము తీవ్ర అసంతృప్తితో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో శరణ్ భూపాల్, మెట్లీ కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, విక్రాంత్, శ్రీశైలం, దేవేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో వనపర్తి కీర్తి కొనసాగించాలి

- **నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా క్రీడాకారుల ఎంపిక.**

వనపర్తి, సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):


క్రీడల్లో వనపర్తి జిల్లాకు ఉన్న ప్రత్యేక గుర్తింపును కొనసాగించేలా క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ అన్నారు. క్రీడల్లో పాల్గొనడం ముఖ్యమని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.నవంబర్ 14 నుంచి 16 వరకు హైదరాబాద్ సమీపంలోని సదాశివపేట, కామ్మోల్‌లోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న 20వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2026లో పాల్గొనే వనపర్తి జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. వనపర్తిలోని డాక్టర్ బాలకృష్ణయ్య స్టేడియం మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమానికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వనపర్తి సీఐ రత్నం, జిల్లా యువజన క్రీడల అధికారి టి.సుధీర్‌కుమార్‌రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ..క్రీడల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి ఎంపిక పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని, ఫలితాలను సమానంగా స్వీకరించి మరింత పట్టుదలతో సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు. జాతీయస్థాయి పోటీల్లో వనపర్తి జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందుతున్న సహకారాన్ని ప్రస్తావిస్తూ విజ్ఞాన్ కళాశాల, వాగ్దేవి కళాశాల, బచపాన్ పాఠశాల, బండారు రఘు తదితర దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సహకరిస్తున్న దాతల సేవలను అభినందించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. జాతీయస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో పీడీలు నందన్, జబ్బర్, మహేష్, పీఈటీలు బసవరాజ్, ఉమాశంకర్, అజయ్, పులేందర్, ప్రవీణ్, శోభ, మాలతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మోదీ జన్మదిన వేడుకల్లో విద్యార్థుల ప్రతిభకు పట్టం

నంద్యాల సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పాములపాడు మండలంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రత్యేక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మండలంలోని, పాములపాడు, లింగాల, మిట్టకందాల, వేంపెంట ప్రభుత్వ పాఠశాలలు, శ్రీ వివేకానంద విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా బీజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు సూచనలతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవా ప్రస్థానం, 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్, ఆత్మనిర్భర్ భారత్, దేశ అభివృద్ధి ప్రయాణం వంటి అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీయడంతో పాటు వ్యాసరచన, వక్తృత్వం ద్వారా తమదైన శక్తి ద్వారా వ్యక్తం చేశారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ప్రత్యేక బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణయ్య, పార్టీ కార్యకర్తలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





రైతు సంక్షేమమే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలి

- **ఘనంగా తట్టేపల్లి సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం**
- **నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు**
- **నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బీఎస్ఆర్)**
- **వ్యవసాయ రంగ అభివృద్ధికి పీఏసీఎస్‌లు కీలకం**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

పెద్దేముల్, సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

రైతు సంక్షేమమే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. బుధవారం పెద్దేముల్ మండలం తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్‌గా పి.మహిపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బండమీదిపల్లి జగన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నూతన చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన సహకారం అందించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రైతులకు రుణాలు,ఎరువులు, వ్యవసాయ సంబంధిత సేవలు సకాలంలో అందేలా పాలకవర్గం కృషి చేయాలని సూచించారు.రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి,వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ,సంఘం అభివృద్ధితో పాటు రైతుల ఆర్థిక ప్రగతికి దోహదపడే విధంగా నూతన పాలకవర్గం పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ పి.లక్ష్మారెడ్డి,పెద్దేముల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఈ.నారాయణ గౌడ్,తాండూరు నియోజకవర్గ ఎస్ఐఆర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావు,తట్టేపల్లి సొసైటీ సీఈఓ కే.రాజమౌళి, తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి తట్టేపల్లి కే.నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.ఎల్లారెడ్డి,ఉప్పరి మల్లేశం, కే.శోభారాణి ,మంబాపూర్ శ్రీనివాస్ రెడ్డి,గాజీపూర్ లాల్ రెడ్డి, డీలర్ అంజయ్య, రాము నాయక్,వడ్ల ఆనందం,ఇందూరు బాలు, హన్మంతు,సొసైటీ సిబ్బంది వై.జగదీష్,రాములు, మల్లేషం,వివిధ గ్రామాల సర్పంచులు, సహకార సంఘం సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పీఏసీఎస్ సభ్యులు,ఆయా గ్రామాల రైతులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,స్థానిక ప్రజాప్రతినిధులు,తట్టేపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న సంఘాల బలోపేతం పై సర్ప్ సిఆర్ పిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ.

శంషాబాద్ సెప్టెంబర్ 30(డీడీ9 వార్త):

శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామంలో బుధవారం చిన్న సంఘాల బలోపేతం పై సర్ప్ సిఆర్ పిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణలో చిన్న సంఘాల నిర్వహణ, సభ్యుల బాధ్యతలు, పొదుపు అలవాట్లు, ఆర్థిక క్రమశిక్షణ, సంఘాల బలోపేతం, సమర్థవంతమైన నిర్వహణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించబడింది. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణను ఆసక్తిగా విన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని శంషాబాద్ మండలం ఎపిఎం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం, ఉప సర్పంచ్ ప్రేమ్ రాజ్, సంతోషం, వార్డు సభ్యులు, ఎస్ఆర్పి వివోఏ బాలమణి, స్వయం సహాయక సంఘాల సభ్యులు శివ లీల, భాగ్య లక్ష్మి, యశోద, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ అండ్ బి శాఖకు ఏమిచ్చారో...?



రహదారిని "స్టాక్ యార్డ్ "చేసేశారు

- మాఫియాకు ఆర్ అండ్ బి రోడ్లు తాకట్టు పెట్టేశారా..?
- ప్రధాన రహదారిని ఆనుకునే ఇసుక డంపింగ్
- రవాణా ఇబ్బందులు ఎవరికీ పట్టవా?
- ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే ఎవరిది బాధ్యత..?
- ప్రజా ప్రయోజనాలు ఫణంగా పెట్టేశారా..?
- ఇసుక మాఫియా అనుకూలతలే ముఖ్యమా...?
- కాంట్రాక్టర్లకు ఆర్ అండ్ బి రహదారులు దారాదత్తం
- టిఎస్ఎండిసికి అవినీతి మత్తు
- ఇసుక నిల్వల నిర్వహణపై పర్యవేక్షణ లోపం

ప్రభుత్వ శాఖ ఏదైనా ఇసుక మాఫియా కు దాసోహం కావాల్సిందే... ఇసుక బినామీలు ఏమి చేసినా నోరు మూసుకోవాల్సిందే... ఏజెన్సీలో ఇసుక కాంట్రాక్టర్ల ఇస్టా రాజ్యం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమైపోతున్నాయి. మాఫియా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అడిగే వారే లేరు. ఇసుక అక్రమార్కులు ఇస్తున్న మామూళ్లకు దాసోహమై అధికార యంత్రాంగం ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తుంది. ఇసుక నిల్వల వ్యవహారంలోబినామీ కాంట్రాక్టర్లు తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు ప్రజలకు ఇబ్బందులు కలిగించే రీతిలో వ్యవహరిస్తున్న ఇసుక మాఫియా ఆగడాలపై చర్యలు తీసుకునే నిజాయితీ అధికారుల్లో లేకపోవడంతో ప్రజలకు శాపంలా మారింది

వెంకటాపురం డి డి 9 వార్త

ములుగు జిల్లాలో పాలనాధికారి పనితీరును ప్రశ్నించే స్థాయిలో ఇసుక మాఫియా పెట్రేగుతుంది. జిల్లాలోని ఇసుక రీచ్ ల నిర్వహణ కు సంబంధించిన నిబంధన లోపాలపై అధికారులు పట్టించుకోకపోవడంతో బినామీ కాంట్రాక్టర్లు పెట్రేగిపోతున్నారు ములుగు జిల్లాలోని ఎదిర ఇసుక రిచ్ కు సంబంధించి ఇసుక నిల్వలు ఇష్టారాజ్యంగా పెట్టేసిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో ఆర్ అండ్ బి శాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మౌనమెందుకు..?

మామూళ్లు ఇచ్చారా..?

ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఎదిర వద్ద ఇసుక రీచ్ కు సంబంధించిన నిల్వలను ఆర్ అండ్ బి రహదారి ఇరువైపులా ప్రధాన రహదారిని ఆనుకొని నిల్వ చేయడం ఆర్ అండ్ బి శాఖ పనితీరును ప్రశ్నిస్తుంది. వెంకటాపురం నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి కి ఇరువైపులా ఎదిర వద్ద రహదారిని ఆనుకుని ఇసుక నిల్వలు ఉండడంవల్ల వాహనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి రహదారిని ఆనుకొని ఇసుక స్టాక్ పాయింట్ ను బినామీ కాంట్రాక్టర్లు ఏర్పాటు చేస్తే ఆర్ అండ్ బి శాఖ మౌనంగా ఉండడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి మాఫియా ఇచ్చిన మామూళ్లకు తలొగ్గి ఆర్ అండ్ బి శాఖ ఇసుక స్టాక్ యార్డ్ పై నోరు మెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం అరహదారుల్లో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో రహదారుల సైతం మూసివేసేలా పెద్ద ఎత్తున ఇసుక నిల్వ చేయడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు

మాఫియా ఇష్టారాజ్యానికి వదిలేశారు

ములుగు జిల్లాలో ఇసుక రీచ్ ల నిర్వహణ మాఫియా ఇష్టారాజ్యానికి వదిలేసినట్లుగానే కనిపిస్తుంది. నిబంధన ప్రకారం ఇసుక స్టాక్ యార్డులు నిర్వహించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఆర్ అండ్ బి రహదారులకు అనుకొని భారీ స్థాయిలో ఇసుకను డంపింగ్ చేసిన టిఎస్ఎండిసి అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా స్టాక్ నిల్వలకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారనే ప్రశ్నలు ఇక్కడ వ్యక్తం అవుతున్నాయి... ఒకవేళ అనుమతులు ఇచ్చిన ఆర్ అండ్ బి శాఖ మౌనంగా ఉండడం వెనక మామూళ్ల వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఆర్ అండ్ బి రహదారి ఇరువైపులా రోడ్డును ఆనుకొని ఇసుక మాఫియా ఇసుక నిల్వ చేయడం వెనక ఆర్ అండ్ బి శాఖలోని కొందరు అవినీతిపరులకు భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణ నేపథ్యంలో తక్షణమే ఆర్ అండ్ బి శాఖ స్పందించి రహదారికి ఆనుకొని ఉన్న ఇసుకను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోనట్లయితే మామూళ్ల ఆరోపణలు వాస్తవమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతాయి.









ఆర్చరీలో చరిత్ర సృష్టించిన భారత ప్లేయర్లు.. మరో గోల్డ్ కైవసం

- కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్‌కు స్వర్ణం.. ఒలింపిక్స్ బెర్త్ ఖరారు
- గోల్డ్ గెలిచిన సాహిబ్ జాదవ్, చికితా తానివర్తి జోడీ
- మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టుకు కూడా స్వర్ణ పతకం
- స్క్వాష్ మహిళల జట్టు సెమీస్‌కు.. మరో పతకం ఖాయం



డి డి 9 వార్త:

ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆర్చరీలో నేడు భారత్‌కు స్వర్ణాల పంట పండింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఫైనల్‌లో చైనాను చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. అదే జోరులో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సాహిబ్ జాదవ్, చికితా తానివర్తి జోడీ స్వర్ణం గెలిచింది. ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు అర్హత కూడా సాధించి భారత్‌కు రెట్టింపు ఆనందాన్ని అందించింది.ఇతర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల స్క్వాష్‌లో తన్వి ఖన్నా, అనహత్ సింగ్‌లతో కూడిన జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లి మరో పతకాన్ని ఖాయం చేసింది. అథ్లెటిక్స్ ఈవెంట్లు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి రెజ్లర్లు, బాక్సర్లు, ఆర్చర్లపైనే ఉంది.

హాకీలో భారత మహిళల జట్టు ఫైనల్‌లో స్థానం కోసం దక్షిణ కొరియాతో తలపడనుంది. స్టార్ జూడోకా అస్మితా దేయ్ కూడా బరిలోకి దిగనుంది. నిన్న మహిళల ట్రాప్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన నీరూ ధండా, నేడు మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్‌లో పోటీపడనుంది.

ఓపెనింగ్ నుంచి నాలుగో స్థానానికి.. కొత్త సవాళ్లపై గైక్వాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు ప్రత్యేక సవాళ్లున్నాయన్న గైక్వాడ్
- నాలుగో స్థానంలో స్ట్రైక్ రొటేషన్ కీలకమని వ్యాఖ్య
- సుదీర్ఘ విరామం తర్వాత ఆడితే ఒత్తిడి సహజమన్న గైక్వాడ్
- భవిష్యత్తు గురించి కాకుండా ప్రస్తుత అవకాశంపైనే దృష్టి పెట్టానని వెల్లడి
- భారత్ తరఫున ఆడే ప్రతి అవకాశాన్ని ఆస్వాదిస్తానని వ్యాఖ్య

డి డి 9 వార్త :

అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగడం కొంత ఒత్తిడికి గురి చేస్తుందని టీమిండియా బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. ఓపెనర్‌గా ఆడటానికి, మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయడానికి చాలా తేడా ఉంటుందని చెప్పాడు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఆడేటప్పుడు పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని వివరించాడు. రెండో వన్డేకు ముందు ప్రసారకర్తలతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు.

మిడిలార్డర్‌లో ప్రత్యేక సవాళ్లు

తాను ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 100కు పైగా ఇన్నింగ్స్‌లు ఓపెనర్‌గా ఆడినట్లు గైక్వాడ్ తెలిపాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు సింగిల్స్ తీస్తూ స్ట్రైక్ రొటేట్ చేయడం కీలకమని పేర్కొన్నాడు. పవర్‌ప్లేలో ఫీల్డర్లు లోపల ఉండటంతో బౌండరీలు సాధించడం సులభమవుతుందని, మిడిలార్డర్‌లో మాత్రం పరిస్థితులను బట్టి సరైన షాట్లు ఎంచుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. తన బలాలపై నమ్మకంతో ఆడటమే ముఖ్యమని అభిప్రాయపడ్డాడు.

సుదీర్ఘ విరామంతో ఒత్తిడి

దక్షిణాఫ్రికాపై 2025 డిసెంబరులో సెంచరీ చేసిన తర్వాత పలు మ్యాచ్‌లు ఆడినట్లు గైక్వాడ్ తెలిపాడు. ఐపీఎల్‌తో పాటు భిన్నమైన పరిస్థితుల్లో, వేర్వేరు స్థానాల్లో బ్యాటింగ్ చేసినట్లు చెప్పాడు. చాలా కాలం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చినప్పుడు సహజంగానే కొంత ఆందోళన ఉంటుందని పేర్కొన్నాడు. తిరువనంతపురంలో జరిగిన గత మ్యాచ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించగా.. గైక్వాడ్ 13 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో క్రీజులో కొంతసేపు గడపడం తనకు ఉపయోగపడిందని తెలిపాడు.

అవకాశం వచ్చినప్పుడల్లా సత్తా చాటడమే..

జాతీయ జట్టులో ఆడే అవకాశాలు అప్పుడప్పుడు మాత్రమే వస్తున్నా.. భవిష్యత్తు గురించి అతిగా ఆలోచించకుండా ప్రస్తుత అవకాశంపై దృష్టి పెట్టాలని గైక్వాడ్ చెప్పాడు. భారత్ తరఫున ఆడే అవకాశం రావడమే గొప్ప విషయమని, ఆ సమయంలో తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే లక్ష్యమని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు అవకాశాలపై అనిశ్చితిని జీర్ణించుకోవడం కష్టమైనప్పటికీ, దేశం తరఫున ఆడటాన్ని ఆస్వాదించాలని పేర్కొన్నాడు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.